

న్యూ ఇయర్ జోష్!

- ఉత్సాహంగా ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం
- ఆలయాలు, సాయిమందిరాలు కిటకిట
- రాజకీయ నేతల ఇళ్లలో సందడి



నెల్లూరు : బాలాజీనగర్‌లోని అద్దాల సాయిబాబా మందిరంలో..



నెల్లూరు (సాంస్కృతికం) : ఆంగ్ల సంవత్సరాదిని జిల్లావాసులు ఉత్సాహంగా స్వాగతం పలికారు. 2023లో ఎదురైనా తీపి, చేదుజ్ఞాపకాలను మరిచిపోయి 2024లో అంతా మంచి జరగాలని ఆకాంక్షించారు. నూతన సంవత్సరాదిని ఆహ్వానిస్తూ సోమవారం తెల్లవారుజామున యువత హంగామా చేసింది. ప్రధాన కూడళ్లు, రోడ్లపై బాణసంచా పేల్చుతూ కేకులు కట్ చేశారు. ఇక ఉదయం ఇంటిల్లిపాది ఆలయాలను దర్శించుకుని కొత్త సంవత్సరంలో తాము అనుకున్నది నెరవేరాలని దేవుళ్లను ప్రార్థించారు. నెల్లూరులోని తల్పగిరి రంగనాథస్వామి, రాజరాజేశ్వరి, వేణుగోపాలస్వామి, వెంకటేశ్వర స్వామి, సాయిబాబా ఆలయాలతోపాటు నృసింహకొండ, జొన్నవాడలోని కామాక్షితాయి, పెంచలకోనలోని లక్ష్మీనృసింహ స్వామి, బోగోలు మండలంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి తదితర ప్రాంతాల్లోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. మరోవైపు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపేందుకు అధికారుల వద్దకు ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నేతల ఇళ్ల వద్దకు నాయకులు, కార్యకర్తలు క్యూ కట్టారు.



కావలి : ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి వద్దకు క్యూ కట్టిన పోలీసులు



కావలిలో బాణసంచా పేలుళ్లు

● రాజకీయ కోలాహలం

కావలి : 2024 సంవత్సరాన్ని రాజకీయ నాయకులు ఎన్నికల సంవత్సరంగా గుర్తించారు. దీంతో వివిధ పార్టీల నేతలు తమ ఇళ్ల వద్దనే ఉంటూ అభిమానులతో నూతన సంవత్సర వేడుకలను రాజకీయ వేడుకలుగా మలుచుకున్నారు. కొందరు నాయకులు, ప్రజలు ఎవరి వద్దకు వెళితే ఏమవుతుందోనని నలిగిపోయారు. నెల్లూరు, కావలి, కందుకూరు, ఆత్మకూరు, కోవూరు ఇలా అన్ని ప్రాంతాల్లోనూ తమ నేతలను ప్రసన్నం చేసుకునేందుకు క్యూ కట్టారు. బొకేలిచ్చి, కేకులు కట్ చేయించి, సన్మానాలు, సత్కారాలతో హోరెత్తించారు.

అనుమతులిచ్చి.. కేసులు కట్టి!

నెల్లూరు (క్రైం) : నూతన సంవత్సరం సందర్భంగా మద్యం అమ్మకాల విక్రయాల వేళలను పెంచుతూ ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. మద్యం దుకాణాల్లో సాధారణ రోజుల్లో ఉదయం 10 నుంచి, నగరంలో 11 నుంచి రాత్రి 9 గంటల వరకు మద్యం అమ్మకాలు సాగిస్తారు. బార్లలో ఉదయం 9 నుంచి రాత్రి 11 గంటల వరకు మద్యం విక్రయాలకు అనుమతులు ఉన్నాయి. అయితే నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆదాయం పెంచుకునేందుకు ఎక్సైజ్ శాఖ విక్రయ వేళలను పెంచింది. ఇదిలా ఉంటే ఎస్పీ డాక్టర్ కే తిరుమలేశ్వరరెడ్డి ప్రశాంత వాతావరణంలో నూతన సంవంత్సర వేడుకలు జరుపుకోవాలని, అర్ధరాత్రి అనవసరంగా రోడ్లపైకి వస్తే కఠిన చర్యలు తప్పవని ముందుగానే హెచ్చరించారు. ఈ క్రమంలోనే ఆదివారం రాత్రి 10 గంటల నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రధాన కూడళ్లు, సెంటర్లలో పోలీసుల పహారా ఏర్పాటు చేశారు. ముఖ్యంగా నెల్లూరు నగరంలో పోలీసు యంత్రాంగం మొత్తం రోడ్లపై మోహరించింది. రాత్రి 11 దాటిన తర్వాత రోడ్లపైకి వచ్చిన వాహనాలను నిలిపి తనిఖీ చేశారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహించారు. మద్యం దుకాణాలకు వెళుతున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే ప్రభుత్వమే తాగండి అని మద్యం దుకాణాల వేళలు పెంచడం ఎందుకు... మద్యం కొనుగోలు చేసే, బార్లలో సేవించో ఇళ్లకు వెళుతుంటే పట్టుకోవడం ఎందుకు అని మందుబాబులు ప్రశ్నిస్తున్నారు.



రాపూరు : పెంచలకోనలో భక్తుల రద్దీ



తల్లీ చల్లగ చూడు..!

గగనవిజయం

కొత్త ఏడాది షార్‌లో తొలి ప్రయోగం సక్సెస్ సంబరాలు



నాల్గవ దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్‌ఎల్వీ 60వ ప్రయోగం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో కొత్త ఉత్సాహం నింపింది. సంవత్సరం ప్రారంభపు రోజున ఇస్రోకి లభించిన విజయంగా భావిస్తున్నారు. ఇస్రో విజయాశ్వంగా భావించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ సోమవారం ఉదయం ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కీలక పరిశోధనలకు ఉపయోగపడే పది పరికరాలను అంతరిక్షంలోకి చేర్చింది. ఇస్రో భవిష్యత్ ప్రయాణానికి ఈ ప్రయోగాలు చాలా ప్రాధాన్యం కలిగినవి.

● సంబరాలు

ఆదివారం ఉదయం 8.10 గంటలకు మొదలైన రాకెట్ కౌంట్‌డౌన్ 25 గంటలపాటు కొనసాగింది. సోమవారం ఉదయం 9.10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి పీఎస్‌ఎల్‌వీ దూసుకెళ్లింది. ఏ రకమైన తడబాటు లేకుండా నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, పరికరాలనూ ప్రవేశపెట్టడంతో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగులు పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. హ్యాపీ న్యూ ఇయర్‌తో పాటూ కంగ్రాట్స్ అనే మాట అందరినోటా వినిపించింది. విజిటర్స్ గ్యాలరీలో ప్రయోగాన్ని చూసేందుకు వచ్చినవారి చప్పట్లతో, ఈలలతో ఆ ప్రాంతం మార్మోగింది. అంతరిక్షంలోకి పంపిన పది పరిశోధక పరికరాల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా శ్రీహరికోట నుంచి ప్రయోగాన్ని వీక్షించారు.



రాకెట్ ప్రయోగాన్ని వీక్షిస్తున్న సందర్శకులు

ఇరు ప్రభుత్వాలతో మాట్లాడతా!

● తమిళ మత్స్యకారుల దాడులపై కేంద్ర మంత్రి పురుషోత్తం

చిట్రగుంట, జనవరి 1 : తమిళనాడు మత్స్యకారుల దాడులు, మత్స్య సంపద దోపిడీపై ఆ రాష్ట్ర ప్రభుత్వంతోపాటే ఏపీ ప్రభుత్వంతోనూ మాట్లాడి సమస్యను పరిష్కరించనున్నట్లు కేంద్ర మత్స్య, పశుసంవర్థక, పాడి పరిశ్రమ శాఖల మంత్రి పురుషోత్తం రూపాలా స్పష్టం చేశారు. బోగోలు మండలం జువ్వలదిన్నె ఫిషింగ్‌హార్బర్‌లో సోమవారం 10వ సాగర పరిక్రమ కార్యక్రమం జరిగింది. నౌకాయాన షిప్‌లో వచ్చిన కేంద్ర మంత్రి పురుషోత్తం రూపాల దంపతులకు రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి. ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆప్కాఫ్ ఛైర్మన్ అనిల్‌బాబు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మత్స్యకారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో గంగపుత్రుల సమస్యలను ఎమ్మెల్యే, మత్స్యకార నేత గోవిందస్వామి వివరించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్ పనులు త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. హార్బర్ నిర్మాణంలో కొద్దిపాటి మార్పులు, పొడిగింపు, తుఫాన్ వంటి ప్రకృతి విపత్తుల్లో బోట్లకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్యలు తీసుకుంటామన్నారు. బోట్లు నిలిచేందుకు మరోవైపు ప్లాట్‌ఫామ్ ఏర్పాటు విషయమై అధికారులతో మాట్లాడతామని చెప్పారు. ఇక తమిళనాడులోని కడలూరు ప్రాంత మత్స్యకారుల దాడులు, ఆంధ్రలోని మత్స్యసంపద దోచుకుపోవడంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. అనంతరం మత్స్యకారులకు రాయితీ రుణాల చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మత్స్య శాఖ కమిషనర్ కన్నబాబు, జేడీ నాగేశ్వరరావు, జేసీ కూర్మనాథ్, తహసీల్దారు హేమంత్ కుమార్, సర్పంచు అంకమ్మ, బీజేపీ, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



మత్స్యకారులకు చెక్కు అందజేస్తున్న కేంద్రమంత్రి పురుషోత్తం రూపాలా

అంతన్నావ్.. ఇంతన్నావో జగనన్న..!

పాటలు పాడి, నృత్యం చేస్తూ అంగన్‌వాడీల నిరసన



నెల్లూరు : పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న అంగన్‌వాడీలు

నెల్లూరు(వైద్యం) జనవరి 1 : 'అంతన్నావ్.. ఇంతన్నావో జగనన్న.. ఇచ్చిన హామీలు ఏమయ్యాయో జగనన్న' అంటూ అంగన్‌వాడీలు పాటలు పాడుతూ నృత్యం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. తమ డిమాండ్ల సాధన కోసం అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న ఆందోళన సోమవారానికి 21వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నెల్లూరులోని ఐసీడీఎస్ జిల్లా కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అంగన్‌వాడీలు పాటలు పాడుతూ, నృత్యం చేస్తూ అందరినీ ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను సానుకూలంగా పరిష్కరించకపోగా ప్రభుత్వం కక్ష సాధింపులకు దిగుతోందని మండిపడ్డారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెహనా బేగం మాట్లాడుతూ అంగన్‌వాడీలను ప్రభుత్వం మానసిక క్షోభకు గురిచేస్తోందని, ఇకనైనా కక్షసాధింపు ధోరణి మానుకొని సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సునీత, రజనీ, రమ, సుజాత పాల్గొన్నారు. కావలి, ఆత్మకూరు, ఉదయగిరి, అనంతసాగరం తదితర ప్రాంతాల్లోనూ అంగన్‌వాడీలు పాటలు పాడి, నృత్యం చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.



ఆత్మకూరులో కోలాటం...



అనంతసాగరంలో పందరి భజనతో నిరసన



కావలి : సమ్మెలో పాల్గొన్న బాలికలు

● కొత్త ఏడాదికి సమ్మెతో స్వాగతం



నెల్లూరు : గాంధీబొమ్మ కూడలి వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

నెల్లూరు (సిటీ): ప్రపంచ వ్యాప్తంగా నూతన సంవత్సరానికి హంగు, ఆర్భాటాలతో ప్రజలంతా స్వాగతం పలకగా నెల్లూరులో మాత్రం మున్సిపల్ కార్మికులు సమ్మెతో స్వాగతం పలికారు. అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలన్న ఏకైక డిమాండ్‌తో 7 రోజులుగా సమ్మె బాటపట్టిన పారిశుధ్య కార్మికులు ఆదివారం అర్ధరాత్రి దాటక కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతూనే జగన్ ప్రభుత్వంపై నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలోని గాంధిబొమ్మ కూడలి వద్ద ఆందోళన వ్యక్తం చేశారు. వీరికి జనసేన నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు కత్తి శ్రీనివాసులు, జనసేన నాయకుడు సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మళ్లీ సురక్ష

- ఆర్నెళ్లపాటు రెండోవిడత వైద్యశిబిరాలు
- మొదటి విడతలోనే అభాసుపాలు
- 3 లక్షలమందికి సేవలందించినట్లు గొప్పలు
- ఇప్పటికీ అందని నిర్వహణ ఖర్చులు
- వైద్యసేవలూ అంతంత మాత్రమే!
- రెండో విడత కోసం ప్రణాళికలు
- ఎన్నికల కోసమేనంటూ ప్రతిపక్షాల విమర్శలు

నెల్లూరు (వైద్యం), జనవరి 1 : 'జగనన్న ఆరోగ్య సురక్ష' రెండో విడత కార్యక్రమం మంగళవారం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వ సూచనలతో ఆర్నెల్లపాటు వైద్యశిబిరాలు నిర్వహించేలా వైద్యాధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అయితే, కార్యక్రమ నిర్వహణపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

● తొలివిడతే అభాసుపాలు

మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గత ఏడాది సెప్టెంబరు 30వ తేదీన మొదలై నవంబరు 15వ తేదీ వరకు సాగింది. జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి, ఈ శిబిరాలకు రోగులకు తరలించే బాధ్యతను వైసీపీ నాయకులతోపాటు గ్రామ, వార్డు వలంటీర్లు చేపట్టారు. మొత్తం 45 రోజులపాటు 663 వైద్య శిబిరాలు నిర్వహించగా, 3 లక్షల మంది పాల్గొన్నట్లు వైద్యులు గొప్పగా చెబుతున్నారు. వీరిలో 7700 మందిని మెరుగైన వైద్యం కోసం ఏరియా, జిల్లా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రులకు సిఫారసు చేసినట్లు వెల్లడించారు. ఇక 5,111 మందిని కంటి శుక్లాలు శస్త్రచికిత్సలకు ఎంపిక చేయగా, వీరిలో 45 శాతం మందికిపైగా చికిత్సలు అందించలేదు. వీరినే ప్రస్తుతం నిర్వహించనున్న శిబిరాలలో ఎంపిక చేస్తారన్న విమర్శలు లేక పోలేదు. 160 రకాల మందులను రోగులకు అందిస్తున్నామని, 26 రకాల వైద్య పరీక్షలు చేస్తున్నామని ప్రభుత్వం ప్రచారం చేసుకుంది. అయితే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్, రక్తపోటు, మధుమేహం, కంటిపరీక్షలు, రక్తం గ్రూప్ వంటి పరీక్షలు మాత్రమే చేసినట్లు తెలుస్తోంది. ఇతర పరీక్షల కోసం శాంపిల్స్ సేకరించి వైద్య పరీక్షలకు పంపించారు. వీటిలో చాలా వరకు ఇంతవరకు పరీక్ష ఫలితాలు రాలేదన్న విమర్శలు ఉన్నాయి. పైగా ఈ వైద్య శిబిరాల నిర్వాహణకు చాలాచోట్ల సర్పంచ్‌లు చేసిన ఖర్చు నేటికి రాలేదన్న ఆరోపణలు ఉన్నాయి.

● ఆర్నెళ్ల పాటు నిర్వహణ

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జూన్ వరకు ఉంటుందని ప్రభుత్వం ఆర్భాటంగా ప్రచారం చేస్తోంది. అయితే, మార్చి లేదా ఏప్రిల్‌లో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో ఈ శిబిరాల నిర్వహణ ఎలాగని వైద్యాధికారులు చెబుతున్నారు. అంతేగాక ఫిబ్రవరి, మార్చి లో ఎన్నికల కోడ్ రానుండటంతో ఈ శిబిరాలు నిర్వహణ సాధ్యం కాదని వెల్లడిస్తున్నారు. పైగా ప్రభుత్వంపై ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉండటంతో దానిని తగ్గించుకునేందుకే ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి.



ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నాం

మంగళవారం నుంచి రెండవ విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరగనుంది. 3వ తేదీన పట్టణ ప్రాంతాలలో వైద్య శిబిరాలు ప్రారంభ మవుతాయి. వంతుల వారీగా మండలాలను ఎంపిక చేసి ఈ శిబిరాలు నిర్వహిస్తున్నాం. 6 నెలలపాటు జరిగే వైద్య శిబిరాలలో ప్రత్యేక వైద్యులను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

- డాక్టర్ పెంచలయ్య, డీఎంహెచ్‌వో

● ఆసుపత్రుల్లో వైద్యుల మాటేమిటి?

ఈ శిబిరాల వల్ల జిల్లాలో ఉన్న 52 ప్రాథమిక ఆసుపత్రులలో ఉన్న ఇద్దరు వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రితోపాటు ఆత్మకూరు జిల్లా ఆసుపత్రి, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రులు, 10 సామాజిక ఆరోగ్య కేంద్రాల నుంచి కూడా స్పెషలిస్ట్ వైద్యులను కూడా ఈ శిబిరాలకు తరలిస్తుండటంతో రోగులు ఇబ్బందులు పడ్డారు.

టీడీపీ ముఖ్యుల ఇళ్లలో

సందడే సందడి !

● భారీగా తరలివచ్చిన కార్యకర్తలు, అభిమానులు



మాజీ మంత్రి సోమిరెడ్డికి గజమాలతో సత్కారం

నెల్లూరు, జనవరి 1 (ఆంధ్రజ్యోతి) : నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం నెల్లూరులోని టీడీపీ ముఖ్య నేతల ఇళ్ల వద్ద సందడి వాతావారణం నెలకొంది. ఉదయం నుంచే కార్యకర్తలు, అభిమానులు భారీగా తరలివచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. అల్లీపురంలోని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్ర మోహన్ రెడ్డిని అభిమానులు గజమాలలు, శాలువాలతో సత్కరించారు. ఇక నారాయణ మెడికల్ కాలేజీలో సిటీ ఇన్‌చార్జి పొంగూరు నారాయణకు శుభాకాంక్షలు చెప్పేందుకు భారీగా తరలివచ్చారు. కుటుంబ సభ్యులు, అభిమానుల మధ్య నారాయణ కేక్ కట్ చేసి అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్రను నాయకులు, అభిమానులు కలిసి సత్కరించారు. మాజీ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డిని ఆయన నివాసంలో వేద పండితులు ఆశీర్వదించారు. నెల్లూరు పార్లమెంటు అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివా సులురెడ్డి నివాసాలకు నాయకులు, అభిమానులు తరలివచ్చి, గజమాలలతో సత్కరించారు.



కుటుంబ సభ్యులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య కేక్ కట్ చేస్తున్న నారాయణ



బీద రవిచంద్రకు శుభాకాంక్షలు తెలుపుతున్న అభిమానులు, పార్టీ శ్రేణులు



వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డికి వేద పండితుల ఆశీర్వచనం



అబ్దుల్ అజీజ్‌ను సన్మానిస్తున్న కార్యకర్తలు, అభిమానులు



కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డికి చిత్రపటం బహూకరిస్తున్న కార్యకర్తలు, అభిమానులు

ఎన్‌డీసీసీబీ సీఈవోగా శ్రీనివాసరావు

నెల్లూరు(హరానాథపురం), జనవరి 1 : నెల్లూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంకు చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి(సీఈవో)గా ఎస్.శ్రీనివాసరావు సోమవారం ఆ బ్యాంకు కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. విజయవాడకు చెందిన ఆయన ముంబైలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో పనిచేసి ఉద్యోగ విరమణ పొందారు. రిటైర్డ్ అధికారి ఎన్‌డీసీసీబీ సీఈవో పోస్టుకు అర్హులు కావడంతో దరఖాస్తు చేసుకుని నియమితులయ్యారు. ఆయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. బాధ్యతలు స్వీకరించిన శ్రీనివాసరావును ఎన్‌డీసీసీబీ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ వారు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ కార్యక్రమంలో డీజీఎం మధుసూదన్‌రావు, అసోసియేషన్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కార్యదర్శి ఎం కాంతారావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఉద్యోగ సంఘం నేతలు

స్పందన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించండి

● అధికారులకు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ ఆదేశం



వినతులు స్వీకరిస్తున్న జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1: స్పందనలో వచ్చే అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సంబంధిత అధికారులను జాయింట్ కలెక్టర్ ఆర్ కూర్మనాథ్ ఆదేశించారు. నూతన సంవత్సరమైనా సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనకు అర్జీదారులు వచ్చి తమ సమస్యలపై అర్జీలు సమర్పించారు. వాటిని స్వీకరించిన జేసీ సంబంధిత అధికారులను పిలిపించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వచ్చిన అర్జీలే మళ్లీ మళ్లీ పునరావృతం కాకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో చిరంజీవి, డీపీవో సుస్మిత, మెప్మా పీడీ నాగరాజు, డీఎస్వో వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● ఐటీడీఏ పీవోపై చర్యలు తీసుకోవాలని కోరుతూ యానాది సంక్షేమ సంఘం జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు సీహెచ్ ఉష, నగర మహిళా అధ్యక్షురాలు కె.వరలక్ష్మి, మహిళా నేతలు వై.భారతి, సుగుణమ్మలు జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్‌కు వినతిపత్రం సమర్పించారు. సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన ఒక అధికారి ఐటీడీఏ కార్యాలయంలో తిష్ట వేసి యానాదులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. ఆయనకు సహకరిస్తున్న ఐటీడీఏ పీవోపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎరువుల ధరలకు రెక్కలు

● అన్నదాతలపై అదనపు భారం



అనంతసాగరం, జనవరి 1 : ఎన్నో ఇబ్బందులు నడుమ వరి సాగు చేస్తున్న రైతులకు పెరిగిన ఎరువుల ధరలు గుదిబండగా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పెన్నాడెల్టాతోపాటు చెరువులు, బోరుబావుల కింద సుమారు 3 లక్షల ఎకరాలకుపైగా వరిసాగులోకి వచ్చింది. ప్రస్తుతం కొన్ని ప్రాంతాల్లో నాట్లు పూర్తవగా మరికొన్ని ప్రాంతాల్లో నాట్లు వేసే పనిలో రైతులు బిజీగా ఉన్నారు. ఈ క్రమంలో సాగుకు అవసరమైన ఎరువులు కొనుగోలుపై అన్నదాతలు దృష్టి సారించారు. నాట్లు వేసుకొనే క్రమంలో దుక్కిపిండి, కాంప్లెక్స్ ఎరువులు, యూరియా అవసరమవుతుంది. గత ఏడాది కాంప్లెక్స్ ఎరువులు 28-28-0, 14-35-14 రూ.1500 కాగా ప్రస్తుతం రూ.1600లకు చేరుకుంది. అలాగే దుక్కిపిండి 20-20-13 రకం రూ.1250 ఉండగా, ప్రస్తుతం రూ1350లకు విక్రయిస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయ సొసైటీల ద్వారా యూరియా బస్తా రూ.266.50లకు ఇస్తుండగా వ్యాపారులు మాత్రం రూ.320 నుంచి 350 అమ్ముతున్నారు. సబ్సిడీ ఎరువులు ఆశించినస్థాయిలో రైతులకు అందుబాటులో లేక వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు జిల్లాలోని రైతు భరోసా కేంద్రాలలో (ఆర్బీకే) అవసరానికి తగ్గట్టు ఎరువుల నిల్వలు ఉంచాలని రైతులు కోరుతున్నారు. కేంద్రాలకు వచ్చిన యూరియాను లారీల వద్ద అమ్మేస్తుండగా చిన్న సన్న కారు రైతులకు సబ్సిడీ యూరియా అందడం లేదు. ఇకనైనా రైతు భరోసా కేంద్రాలలో సమృద్ధిగా ఎరువుల నిల్వలు ఉంచాలని కర్షకులు కోరుతున్నారు.

ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

మనుబోలు, జనవరి 1: ఆటో ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలైన సంఘటన మడమనూరులో ఆదివారం రాత్రి జరిగింది. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన ఓ మహిళ ముగ్గు వేస్తూ హ్యాపీ న్యూ ఇయర్ రాయాలని రహంతుల్లాను అడగడంతో ఆమెకు సహాయం చేస్తుండగా అదే గ్రామానికి చెందిన ప్రదీప్, శరత్, నాగరాజులు మద్యం సేవించి ఆటో నడుపుకుంటూ రహంతుల్లాను ఢీకొట్టారు. దీంతో రహంతుల్లాకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు ఆటోలో ఉన్న యువకుల కోసం వెంటపడగా ప్రదీప్, శరత్‌లు చిక్కడంతో వారిని స్తంభానికి కట్టేసి దేహ శుద్ధి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చే రుకుని యువకులను అదుపులోకి తీసుకుని గాయపడిన రహంతుల్లాను చికిత్సకు తరలించారు. ప్రస్తుతం రహంతుల్లా పరిస్థితి విషమంగా ఉంది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

10 నుంచి యానాదులతో ముఖాముఖి

● యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెంచలయ్య

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1 : ఈనెల 10వ తేదీ నుంచి ఎట్‌దిరేట్ ఆఫ్ కేసీపీ యాత్రలో భాగంగా యా నాదులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించను న్నామని యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీ పెంచలయ్య తెలిపారు. సోమవారం నగరంలోని వెన్నెలకంటి రాఘవయ్య భవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడు తూ యానాదుల సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ఉమ్మడి నెల్లూరు జిల్లాలోని 1500 యానాది కాలనీల్లో యాత్ర సాగుతుందన్నారు. కోవూరు నియోగజకవర్గంలోని గంగవరం నుంచి యాత్రను ప్రారంభిస్తామని చెప్పారు. మార్చి మొదటి వారంలో యానాదు ల రాజకీయ ధూందాం సభ నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో యానాదుల సంక్షే మ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు చేవూరు సుబ్బారావు, జిల్లా చైర్మన్ రాపూరు కృష్ణయ్య, జిల్లా కోశాధికారి ఎల్లంపల్లి రమేష్, చెంబేటి ఉష, కల్లూరు వరలక్ష్మి, రాపూరు కృష్ణయ్య, మానికల మురళి, ఎల్లంపల్లి శ్రీనివాసులు, మాకాని రవీంద్ర, చలంచర్ల కలుగోలమ్మ, మల్లిక, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

కారు, మోటారు బైక్ ఢీ

● యువకుడికి గాయాలు



గాయపడిన సంతోష్

సంగం, జనవరి 1: కారు, మోటారు బైక్ ఢీకొని యువకుడికి గాయాలైన సంఘటన జాతీయ రహదారి సంగం చెక్‌పోస్టు సమీపంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి. పోతిరెడ్డిపాళెం గ్రామానికి చెందిన సంతోష్ మోటారుబైక్‌పై ఆత్మకూరు శాంతినగర్‌కు వెళ్తుండగా మార్గమధ్యంలో సంగం చెక్‌పోస్టు సమీపంలో ఆత్మ కూరు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న కారు ఢీకొంది. దీంతో సంతోష్‌కు గాయాలయ్యాయి. కాగా, సంతోష్ మద్యం మత్తులో ఉన్నట్లు సమాచారం. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రున్ని వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి మెడలో గొలుసు చోరీ

మనుబోలు, జనవరి 1: వృద్ధురాలి మెడలో గొలుసు అపహరించిన సంఘటన స్థానిక కోదండరామపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు... గుర్తుతెలియని ఓ వ్యక్తి మోటార్‌సైకిల్‌పై రామమందిరం వీధిలో రెండు దఫాలు అటు ఇటూ తిరుగుతూ దండు శకుంతలమ్మ అనే వృద్ధురాలి ఇంటి వద్దకు వచ్చి శ్రీధర్ ఇల్లు ఎక్కడ అని అడిగాడు. దీంతో శకుంతలమ్మ ఇంట్లోనుంచి బయటకు రాగానే మెడలో ఉన్న ఒకటిన్నర సవర బంగారు గొలుసు కట్ చేసుకుని మోటార్‌సైకిల్‌పై ఉడాయించాడు. దీనిపై శకుంతలమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో కుటుంబం ఆత్మహత్యాయత్నం

● నెల్లూరుకు తరలింపు





వైద్యశాలలో చికిత్స పొందుతున్న, భాస్కర్, చిన్నమ్మ

కావలి రూరల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ కుటుంబం బిర్యానీలో గుళికలు కలుపుకుని తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ సంఘటన సోమవారం రాత్రి కావలి తుఫాన్ నగర్‌లో చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, కావలి పట్టణంలోని తుఫాన్‌నగర్ బీరువాలసెంటర్‌కు చెందిన ఎండ్లూరి భాస్కర్‌కు గుడ్లూరు మండలం మోచర్లకు చెందిన చిన్నమ్మతో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు. సోమవారం ఉదయం చర్చికి వెళ్లి నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. సాయంత్రం ఇంట్లో బిర్యానీ వండిన భాస్కర్ కుటుంబ సభ్యులకు తెలియకుండా అందులో గుళికలు కలిపాడు. భార్య చిన్నమ్మ, కుమారుడు అవినాష్, కుమార్తె దీపికతో కలసి భాస్కర్ కూడా రాత్రికి ఆ బిర్యానీ తిన్నాడు. మధ్యలో కడుపులో తిప్పుతోందని చిన్నమ్మ భర్తకు చెప్పింది. ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మనల్ని పట్టించుకునేవారు లేరు.. అందుకే మనమంతా చనిపోతున్నామని భాస్కర్ తెలిపాడు. దీంతో ఆమె కేకలు వేయడంతో స్థానికులు 108 వాహనంలో ఏరియా వైద్యశాలకు తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకి తరలించారు.

నేటి నుంచి ముగ్గురమ్మల తిరునాళ్ల

అల్లూరులో రెండు రోజుల సందడి

అల్లూరు, జనవరి 1 : ఎక్కడా లేని విధంగా ఏకకాలంలో ముగ్గురు గ్రామ దేవతల తిరునాళ్లను నిర్వహించేలా అల్లూరులో ఘనంగా ఏర్పాట్లు చేశారు. మంగళవారం ప్రారంభమై బుధవారం సాయంత్రం వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. అల్లూరు (ఊరు) ప్రజల సహకారంతో మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ ఏడాది కూడా వైభవంగా తిరునాళ్లను నిర్వహించనున్నారు. గంగమ్మ, కలుగోళమ్మ, పోలేరమ్మ అమ్మవార్లకు నిర్వహించే ఈ తిరునాళ్లను ఐదు దశాబ్దాల క్రితం చేపట్టారు. అనివార్య కారణాల వల్ల కొంతకాలం నిలిపి వేశారు. తిరిగి పదేళ్ల నుంచి నిర్వహిస్తున్నారు.



పోలేరమ్మ ఆలయం

● ప్రత్యేకంగా చల్ది కార్యక్రమం

ఈ తిరునాళ్లలో చల్ది నైవేద్య కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంది. మహిళలు పసుపు కుండల్లో చల్ది నింపుకొని విష్ణు నివాసం నుంచి ఆయన సతీమణితో కలసి పోలేరమ్మ ఆలయానికి ఊరేగింపుగా చేరుకుంటారు. అనంతరం పోతురాజుకు నైవేద్యాన్ని సమర్పిస్తారు. ప్రతి ఏటా వేలాదిమంది మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని తిలకించేందుకు ప్రతి ఒక్కరూ ఆసక్తి కనపరుస్తారు. తిరునాళ్లలో భాగంగా ఆచారాలకు అనుగుణంగా గంగపెట్టె, వీర తాళ్లతోపాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	122
లేయర్ లైవ్	90
స్కిన్ చికెన్	220
స్కిన్‌లెస్	240
లేయర్	153

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6039
వెండి కిలో ధర	రూ. 76,000
వెండి ఒక గ్రాము	రూ. 78.00

కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

నూతనోత్సాహం

కావలిటౌన్, జనవరి 1: నూతన సంవత్సర వేడుకలు కావలిలో ఘనంగా జరిగాయి. ఆదివారం అర్ధరాత్రి తర్వాత యువత హ్యాపీ న్యూఇయర్ అంటూ కేరింతలు కొడుతూ బాణసంచా పేల్చి సంబరాలు చేసుకుంది. ఉదయం మునునూరులోని ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి నివాసం వద్ద అభిమానులు, కార్యకర్తలు కేక్‌కట్ చేయించారు. అన్ని శాఖల అధికారులు సిబ్బంది ఎమ్మెల్యేను పూలమాలలు, బొకేలు, శాలువాలతో సత్కరించారు.


కందుకూరులో తెలుగు మహిళలతో ఇంటూరి

డీఎస్పీ వెంకటరమణ, పోలీసు అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ మాధవరెడ్డి, ఎంపీడీవో, తదితర శాఖల అధికారులు ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మాలేపాటి సుబ్బానాయుడు నివాసంలో నేతలు, కార్యకర్తలతో సందడి నెలకొంది. మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రభాకర్‌నాయుడును పట్టణ ప్రముఖులు పార్టీలకతీతంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

● **అమలు కాని పోలీసుల ఆదేశాలు**

కావలి : నూతన సంవత్సర వేడుకల నిర్వహణపై డీఎస్పీ ఎం. వెంకటరమణ ఇచ్చిన ఆదేశాలు అమలు కాలేదు. ఎవరూ రోడ్ల మీద కేకలు కట్ చేయటం, బాణసంచా కాల్చటం, మద్యం సేవించి తిరగటం చేయరాదని ఆయన ఆదేశించారు. కానీ డీఎస్పీ కార్యాలయం, వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌కు సమీపంలోని పొట్టి శ్రీరాములు విగ్రహం సెంటర్‌లో ఆదివారం అర్ధరాత్రి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి చేత ఆయన అనుచరులు రోడ్డుపైనే భారీ కేక్‌ను కట్‌చేసి సంబరాలు జరుపుకున్నారు. భారీ ఎత్తున బాణసంచా కాల్చారు.అయినా పోలీసులు కిమ్మనలేదు.


కావలి : మాలేపాటిని సత్కరిస్తున్న టీడీపీ నేతలు

● **గుడ్లూరు :** స్థానిక మండల పరిషత్ కార్యాలయం, వైద్య ఆరోగ్య కేంద్రాల్లో ఎంపీడీవో రాజశేఖర్ కేక్ కట్ చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మారుతీరావు, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

లింగసముద్రం : లింగసముద్రం, పెదపవని, చినపవని, మొగిలిచెర్ల తదితర గ్రామాల్లో ఆదివారం అర్ధరాత్రి యువకులు వీధుల్లోకి వచ్చి కేరింతలు కొడుతూ, నూతన సంవత్సరానికి స్వాగతం పలికారు. తిరుమణిశెట్టి కోటయ్య మందిరం వద్ద సోమవారం ఎస్సై ఎం బాజీబాబు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు కందుకూరు వెళ్లి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. పలువురు మహిళలు లింగసముద్రం, మొగిలిచెర్లలలోని అయ్యప్పస్వామి, దత్తాత్రేయస్వామి ఆలయాలతో పాటు ఇతర దేవాలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

జలదంకి : మండలంలోని జమ్మలపాలెం ఉన్న శ్రీసాయి స్కూల్ ఆఫ్ నర్సింగ్ కాలేజీలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం మహిళలకు ముగ్గుల పోటీలు జరిగాయి. విజేతలకు నగదు బహుమతులను అతిథుల చేతుల మీదుగా కాలేజీ కరస్పాండెంట్ దశరదరామిరెడ్డి అంద చేయించారు. పాల్గొన్నవారికి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కావలి మాజీ కౌన్సిలర్ సురే మదన్‌మోహన్‌రెడ్డి. వైద్యఆరోగ్య శాఖ అధికారి నరసారెడ్డి, విశ్రాంత బీఎస్ఎన్ఎల్ ఉద్యోగి అంజనేయులు చేవూరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : ఇస్కపల్లిలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు నివాసంలో అధికారులు, నాయకులు, అభిమానులు, కార్యకర్తలు ఆయన్ను కలుసుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా భారీ కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మేరిగ మురళి, కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, ఎంపీపీ దగ్గుబంట శశిరేఖ, ఎంపీడీవో జ్యోతి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

కందుకూరు : నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఈ ఏడాది టీడీపీలో జోష్ కనిపించింది. టీడీపీ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు స్థానిక కార్యాలయంలో అందుబాటులో ఉండగా, నియోజకవర్గంలోని గ్రామాల నుంచి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్దసంఖ్యలో తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా స్వర్ణ స్వయంకృషి దివ్యాంగుల పాఠశాల చిన్నారుల మధ్య ఇంటూరి భారీ కేక్‌ను కట్‌చేశారు. యూటీఎఫ్ నాయకులు నాగేశ్వరరావును కలిసి శుభాకాంక్షలు తెలపగా, అనంతరం యూటీఎఫ్ డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సాయంత్రం దివ్యాంగుల పాఠశాలలోని చిన్నారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే దివి శివరాం తన నివాసంలో ఆయన సతీమణి, తెలుగు మహిళ అధ్యక్షురాలు దివి సౌభాగ్యలను మహిళలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు ఈ కార్యక్రమాల్లో నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, నార్నె రోశయ్య, వేముల గోపాలరావు, మాదాల లక్ష్మీనరసింహ్మం, చిలకపాటి మధు, బెజవాడ ప్రసాదు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు ఇంటూరి రాజేష్ కార్యాలయం వద్ద మాజీ ఎంపీపీ పొడపాటి శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గట్టమనేని చెంచురామయ్య తదితరులు ఆధ్వర్యంలో కేకు కట్‌చేసి, విందు ఏర్పాటు చేశారు. వైసీపీ ఎమ్మెల్యే మహీధర రెడ్డి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు వేడుకలకు దూరంగా ఉన్నారు.


ఉదయగిరి శివాలయంలో పూజలు

● **బాబుకు శుభాకాంక్షలు**

ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ సోమవారం కుటుంబ సమేతంగా టీడీపీ అధినేత నారా చంద్రబాబును కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కుప్పం నియోజకవర్గంలో చంద్రబాబు పర్యటన పార్టీ క్యాడర్‌లో జోష్ నింపిందన్నారు.

వలేటివారిపాలెం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీపీ పొనుగోటి మౌనిక, జడ్పీటీసీ ఇంటూరి భారతిలకు ఎంపీడీవో రఫీక్ అహ్మద్, కార్యాలయ సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, జడ్పీటీసీ సలహాదారు హరిబాబు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లింగసముద్రం : మండల టీడీపీ అధ్యక్షుడు వేముల గోపాలరావుకు సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. గోపాలరావు స్వగ్రామమైన మొగిలిచర్లకు పలువురు నేతలు తరలివెళ్లి పుష్పగుచ్ఛాలు, పండ్లు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఆయన్ను కలిసిన వారిలో అంగిరేకులపాడు మాజీ సర్పంచి ముప్పరాజు వెంకటేశ్వర్లు, నాయకులు శికాకొల్లు బాబూరావు, ఎం. శేషయ్య, డీ కనకయ్య, పీ వెంకటేశ్వర్లు, పీ శ్రీకాంత్, డీ వెంకటేశ్వర్లు తదితరులున్నారు.

కొండాపురం : ఆదివారం రాత్రి నుంచే యువకులు కేకులు కట్‌చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది కేకును కట్‌చేసి ఎంపీడీవో ఎమ్.బ్రహ్మయ్యను సన్మానించారు.

ఆత్మకూరు : దేవాలయాలు, చర్చిలు, మసీదులు కొత్త సంవత్సరం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయం, అలగనాథస్వామి ఆలయం, కన్యకాపరమేశ్వరి ఆలయం, అభయాంజనేయస్వామి ఆలయం, శివాలయం, సాయిబాబా మందిరం, కాశీనాయన ఆశ్రమం భక్తులతో నిండిపోయాయి. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డిని పలువురు నేతలు, కార్యకర్తలు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అభిరామ్ మల్టీస్పెషాల్టీ హాస్పిటల్ ఆవరణలో వైద్య సిబ్బంది, అభిమానులు హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ శ్రామణ్‌కుమార్, డాక్టర్ దీప్తి మేకపాటిలకు వైద్యశాల సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సంగం : స్థానిక శివాలయం, ఆంజనేయస్వామి, సాయిబాబా ఆలయాలకు వెళ్లి దర్శనం చేసుకున్నారు. వంగల్లులోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయం, అన్నారెడ్డిపాళెంలోని ఆత్మరామస్వామి ఆలయాలు, కోలగట్లలోని నాగారపమ్మ, తిరుమనకొండలోని రాజరాజేశ్వరిదేవి సమేత కాశీ విశ్వేశ్వరాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అనంతసాగరం : అన్ని గ్రామాల్లో సోమవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది కేక్‌కట్ చేశారు.

మర్రిపాడు : ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి బ్రాహ్మణపల్లిలోని స్వగృహంలో ఉండటంతో నియోజకవర్గంలోని నేతలు కార్యకర్తలు అధిక సంఖ్యలో వచ్చి ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

ఉదయగిరి రూరల్ : గండిపాళెం, గుడినరవ, లింగాలదొనక్షేత్రం, కుర్రపల్లిగడ్డ, ఆర్లపడియ, సున్నంవారిచింతల, అప్పసముద్రం గ్రామాలతోపాటు ఉదయగిరిలోని పార్వతిపరమేశ్వరి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేపట్టారు.

ఉదయగిరి : ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డికి ఆయన నివాసంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అభిమానులు పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పూలదండలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ మూలె పద్మజావినయ్‌రెడ్డిని స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఈశ్వరమ్మ, నాయకులు సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాలలో కళాశాల అసోసియేట్ డీన్ టీ గోపికృష్ణ కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకొన్నారు.

దుత్తలూరు (ఉదయగిరి రూరల్) : నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి స్థానిక జేఎస్ఆర్ ఫౌండేషన్ కార్యాలయంలో నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు, పలు శాఖల అధికారులు శుభాకాంక్షలు తెలియజేస్తూ పుష్పగుచ్ఛాలు అందజేశారు.


ఉదయగిరి : ఎమ్మెల్యే మేకపాటికి శుభాకాంక్షలు తెలియచేస్తున్న అధికారులు, నాయకులు

వరికుంటపాడు : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో శ్రీదేవి ఆధ్వర్యంలో నూతన సంవత్సర సంబరాలను ఘనంగా నిర్వహించారు. గ్రామాల నుంచి సచివాలయ ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, ప్రజా ప్రతినిధులు కార్యాలయానికి చేరుకొని ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.


ఆత్మకూరు : ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, కార్యాలయ సిబ్బంది


గుడ్లూరు ఆరోగ్య కేంద్రంలో..


చంద్రబాబును కలిసిన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్


అల్లూరులో బీద మస్తాన్‌రావు


సంగం : సంగమేశ్వరాలయంలో పూజలు


మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందచేస్తూ..

సమస్యల పరిష్కారం కోసం అంగన్‌వాడీల కోలాటం

కావలి టౌన్, జనవరి 1: అంగన్‌వాడీల సమ్మెలో భాగంగా సోమవారం దీక్షాశిబిరంలో తమ పిల్లలను కూర్చొబెట్టుకుని నిరసన తెలిపారు. అనంతరం కోలాటమాడి ఆందోళన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీల యూనియన్ నేతలు రఘురావమ్మ, సుభాషిణి రజిత, ఎస్‌కె ఆష, కళావతి, వరలక్ష్మి, సీఐటీయూ గౌరవాధ్యక్షుడు పసుపులేటి పెంచలయ్య, కార్మిక సంఘం నాయకులు తాళ్లూరు మాల్యాద్రి, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.


ఉదయగిరి రూరల్: నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

ఆత్మకూరు : పట్టణంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం కోలాటంతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ యూనియన్ నాయకులు, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

అనంతసాగరం: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సోమవారం అంగన్‌వాడీల నిరసన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా పలు ఉపాధ్యాయ సంఘాలు వారికి సంఘీభావం తెలిపారు. అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా పాటలు పాడుతూ పండరి భజన చేశారు.

ఉదయగిరి రూరల్: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె ఉధృతం చేస్తామని సీఐటీయూ నాయకుడు కాకు వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు నిరసన చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ నాయకురాళ్లు చాంద్‌బేగం, ప్రమీలా, పద్మ, అంగన్‌వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిలబడి మున్సిపల్ కార్మికుల నిరసన


కావలిటౌన్: ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు


ఆత్మకూరు : సీఐటీయు ఆధ్వర్యంలో సమ్మె చేస్తున్న మున్సిపల్ కార్మికులు

కావలిటౌన్, జనవరి 1: మున్సిపల్ కార్మికులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం ఒంటికాలిపై నిలబడి నిరసన తెలిపారు. సీఐటీయూ పట్టణ కార్యదర్శి కృష్ణమోహన్ శిబిరాన్ని ప్రారంభించారు. గౌరవాధ్యక్షుడు పెంచలయ్య మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి సమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ నేతలు తురక శీనయ్య, ఓ రమేష్, బీ రమేష్, మల్లికార్జున, బాబు, రాజేశ్వరి, అనిత, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: ఆత్మకూరులో మున్సిపల్ కార్మికుల సమ్మె సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా సీఐటీయు, మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించే వరకు సమ్మె కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయు నాయకులు, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

తూ తూ మంత్రంగా ప్రత్యేక పారిశుధ్యం పనులు


సిమెంటు రోడ్డుపై నిలిచిన మురుగునీరు

వలేటివారిపాలెం, జనవరి 1 : మండలంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను పంచాయతీ అధికారులు తూ తూ మంత్రంగా చేపడుతున్నారు. సైడు కాలువల్లో పూడిక తీయడం లేదు, మురుగునీరు బయటకు పోయేలా చర్యలు తీసుకోవడంలేదు. మురుగునీటి కుంటల్లో బ్లీచింగ్ చల్లడంలేదు. ఫాగింగ్ చేయడంలేదు. వాటర్‌ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయడంలేదు.దీంతో గ్రామీణులు ఇక్కట్లు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా రహదారులు
● **వాహనదారుల ఇక్కట్లు**


కలిగిరి-సంగం రహదారి దుస్థితి

కలిగిరి, జనవరి 1 : కలిగిరి నుంచి సంగం, కొండాపురం మార్గాల్లో రహదారులన్నీ గుంతలమయంగా మారి, ప్రయాణం చేయడానికి వీలులేకుండా పోయాయి. తారు రోడ్లు పూర్తిగా ఆనవాళ్ల కోల్పోయి మట్టి రోడ్లుగా దర్శనమిస్తున్నాయి. ఈ మార్గాల్లో ప్రయాణించే వాహనదారులు పదేళ్లుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కలిగిరి నుంచి సంగం మార్గంలో పాతనాపురం నుంచి హసనాపురం వరకు సుమారు 8 కి.మీ. మేర రహదారి పూర్తిగా ధ్వంసం అయింది. తూతూ మంత్రంగా తాత్కాలిక మరమ్మతులు నిర్వహించడంతో అది మూణ్నాళ్ల ముచ్చటగామారి, నెల తిరిగే లోపు భారీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ఈ మార్గంలో ప్రయాణించాలంటే పలువురు హడలిపోతున్నారు. నిత్యంవందలాది వాహనాలు ఈ మార్గంలో ప్రయాణిస్తున్నా రహదారికి కనీస మరమ్మతులు చేయలేదు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు నిర్వహించి ప్రయాణానికి ఇబ్బందులు లేకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

వైభవంగా వెంగమాంబ ఇరుముడుల మహోత్సవం


ఊరేగింపుగా వెళుతున్న వెంగమాంబ భక్తులు

దుత్తలూరు(ఉదయగిరి రూరల్), జనవరి 1: నర్రవాడ వెంగమాంబ పేరంటాలు దీక్ష చేపట్టిన భక్తులు సోమవారం మండలంలోని వడ్డిపాళెంలో ఇరుముడుల మహోత్సవం వైభవంగా నిర్వహించారు. వడ్డిపాళెం నుంచి నర్రవాడ వెంగమాంబ పేరంటాలమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా చేరుకుని అమ్మవారికి ఇరుముడులు సమర్పించారు. ఆలయం ఆవరణలో మహాకుంకుమ, పడి పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నట్లు గురుస్వామి మేడేపల్లి మాల్యాద్రి తెలిపారు.

గిన్నిస్ బుక్‌లో కావలి చిన్నారులకు చోటు

కావలి, జనవరి 1: స్థానిక శ్రీమేధ నృత్య కళానిలయానికి చెందిన చిన్నారులు కూచిపూడి నృత్యప్రదర్శనలో ప్రతిభ చూపి గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించారు. దీంతో ఎమ్మెల్యే నివాసంలో ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి, ఆయన సతీమణి ఆదిలక్ష్మిలు సోమవారం వారిని అభినందించారు. ఇటీవల హైదరాబాద్ గచ్చిబౌలి స్టేడియంలో కూచిపూడి నృత్య ప్రదర్శనలో చిన్నారులు పాల్గొన్నారు. గిన్నిస్‌బుక్‌లో చోటు సాధించిన వారిలో గీతికా హాసిని, పామూరు మోక్షిత, హనిఫ, నేహ, దనికా, జాశ్రీత, సమన్వి, నిత్య, నైనిక, శ్రీజలు ఉన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు అన్యాయం : టీడీపీ

ఉదయగిరి, జనవరి 1: మాజీ ఏఎంసీ చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి మరో ఇద్దరిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టడం అన్యాయమని టీడీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ నల్లిపోగు రాజా దుయ్యబట్టారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ నాయకుడు ఎలీషాకుమార్ చేసిన ఆరోపణలు అవాస్తమన్నారు. జాతీయ మానవహక్కుల రక్షణ సమితి రాష్ట్ర కార్యదర్శి సత్తెనపల్లి శ్రీరాములు మాట్లాడుతూ అధికార పార్టీ దౌర్జన్యాలను ఎండగడతామన్నారు. అట్రాసిటీ కేసు నమోదు చేయడం దారుణమని, వెంటనే కేసును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు బయ్యన్న, బొజ్జా నరసింహులు, నల్లిపోగు నరసింహులు, ఓబులరెడ్డి, నారాయణరెడ్డి, గడ్డం నాయుడు తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న నల్లిపోగు రాజా

వైఎస్ఆర్ బీమా అందజేత

లింగసముద్రం, జనవరి 1: మండలంలోని వీఆర్ కోట లో గత నెల 30న గుండెపోటుతో మృతిచెందిన కామినేని మోహన్‌రావు(45)అంత్యక్రియల కోసం వైఎస్ఆర్ బీమా కింద రూ.10 వేలు సోమవారం కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ బీమా పథకం కింద ఇంకా రూ.90 వేలు వస్తాయని, ఆ నగదును ఆయన భార్య బ్యాంకు ఖాతాలో జమ చేస్తామని వెల్ఫేర్ అసిస్టెంట్ సీహెచ్ శివరామ్ చెప్పారు. కార్యక్రమంలో వైసీపీ నాయకుడు వంకాయలపాటి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి విడుదలపై కలెక్టర్‌తో రాజారెడ్డి భేటీ

జలదంకి, జనవరి1: సోమశిల జలాలు మండలానికి విడుదల చేసే విషయమై కలెక్టర్ హరినారాయణన్‌తో సోమవారం సాయంత్రం నెల్లూరులో ఉదయగిరి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డితో కలసి చర్చించారు. ఐఏబీలో కావలి కాలువకు 3టీఎంసీలు కేటాయిస్తూ సాగునీటిని ఎస్‌పీపాలెం మేజర్ వరకే పరిమితం చేశారు. దీంతో జలదంకి మండలానికి కేటాయింపులు చేయకపోవడంతో కలెక్టర్‌తో చర్చించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు మండల నేతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు


గాయపడిన హరికృష్ణ

వలేటివారిపాలెం, జననవరి 1: మోటారుబైకుపై వేగంగా వెళ్తూ అదుపుతప్పి ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండలంలోని చుండి గ్రామ సమీపంలో సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ప్రకాశం జిల్లా పామూరు మండలం బూదవాడకి చెందిన పోతినేని హరికృష్ణ తీవ్ర గాయాలయ్యాయి. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు బంధువులు తెలిపారు. పోలీసుల కథనం మేరకు, హరికృష్ణ బూదవాడ నుంచి వలేటివారిపాలెం వైపు వేగంగా వెళ్తూ మోటారుబైకు అదుపుతప్పి చుండి సమీపంలో బోల్తా పడింది. ఆ ప్రమాదంలో ఆయనకు తీవ్ర గాయాలయ్యాయి. హరికృష్ణను 108లో కందుకూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్చి మెరుగైన వైద్యం కోసం ఒంగోలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చేర్చారు. ఎస్ఐ బాలమహేంద్రనాయక్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

ఉదయగిరి, జనవరి 1: మండలంలో మంగళవారం నుంచి రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎంపీడీవో ఈశ్వరమ్మ సోమవారం తెలిపారు. మంగళవారం వెంగళరావునగర్, 9న గుడినరవ, 23న కొండాయపాళెం, 30న నేలటూరు, ఫిబ్రవరి 2న కృష్ణంపల్లి, 16న శకునాలపల్లి, 23న బండగానిపల్లి, మార్చి 1 జీ.చెరువుపల్లి, 15న ఉదయగిరి-1, 22న ఉదయగిరి-2, ఏప్రిల్ 12న ఉదయగిరి-3, 19 అప్పసముద్రం సచివాలయాల పరిధిలో ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వైద్య, పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేశామన్నారు.

పలువురికి విష్ణు పరామర్శ

అల్లూరు, జనవరి 1 : వివిధ సమస్యలతో బాధపడుతున్న తన అభిమానులను మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సోమవారం సాయంత్రం పరామర్శించారు. మండలంలోని సింగపేటకు చెందిన దంపూరు మల్లికార్జున అనారోగ్యంతో చికిత్స పొంది స్వగ్రామానికి రావడంతో ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. అలాగే గ్రామంలోని పలువురిని పరామర్శించారు. అల్లూరులో బిసి కాలనీకి చెందిన నాయుడు మల్లికార్జున గతేడాది మృతిచెందడంతో కుటుంబ సభ్యులు విదేశాల నుంచి రాగా వారితో మాట్లాడారు.


మల్లికార్జున కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న విష్ణు

కావలి వన్‌టౌన్ సీఐగా రాజేష్



కావలి రూరల్, జనవరి 1: వన్‌టౌన్ పట్టణ సీఐగా మునిపల్లి రాజేష్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కావలి రూరల్ సీఐగా ఉన్న రాజేష్ బదిలీపై వన్‌టౌన్ పట్టణ పోలీస్ స్టేషన్‌కు రాగా, అక్కడ సీఐగా పనిచేస్తున్న కే శ్రీనివాసరావు రెండో పట్టణ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయ్యారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

వింజమూరు, జనవరి 1 : వింజమూరు మండలంలోని అశోక్‌నగర్‌లో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు మల్లెల తిరుమలేశు మాదిగ ఆధ్వర్యంలో మాసిలామణి వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎంఎస్ జిల్లా అధ్యక్షురాలు మంద సుజాతమాదిగ, ఎంఎస్పీ సీనియర్ నాయకులు గోచిపాతల ఆనంద్‌మాదిగ, ఎంఎస్పీ నాయకులు గంగపట్ల వెంగళరావు, చెంచల రాకేష్, మల్లెల రాజశేఖర్, జి.రవీంద్ర, జి సురేష్, జి పెంచలరావు, తదితరులు పాల్గొన్నారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

క్రికెట్ టోర్నమెంట్ విజేత ఏఎస్ఆర్ జట్టు

ఆత్మకూరు, జనవరి 1: పట్టణంలో గత మూడు రోజులుగా జరుగుతున్న విక్రమ సింహపురి యూనివర్సిటీ ఇంటర్ కాలేజ్ టోర్నమెంట్‌లో ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు ఆత్మకూరు జోన్ విన్నర్‌గా విజయకేతనం ఎగరవేసింది. చివరి రోజు డాక్టర్ ఎస్ఆర్‌జె డిగ్రీ కళాశాల జట్టుపై ఏఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. దీంతో జట్టును కళాశాల కరస్పాండెంట్ ఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి, డైరెక్టర్ ప్రసాద్ అభినందించారు.


విజేతగా నిలిచిన ఏఎస్ఆర్ డిగ్రీ కళాశాల జట్టు

కొత్త ఏడాదికి సంబరాలతో స్వాగతం



బుచ్చి : శుభాకాంక్షలు తెలిపిన కార్యకర్తలకు అభివాదం చేస్తున్న దినేష్‌రెడ్డి

బుచ్చిరెడ్డిపాళెం, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం జడ్పీటీసీ సభ్యుడు సూరా ప్రదీప, నగర పంచాయతీ చైర్ పర్సన్ మోర్ల సుప్రజ, కౌన్సిలర్లు, ఎంటీసీలు, సర్పంచులను పలువురు అధికారులు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. పూలమాలలు, శాలువాలతో సత్కరించి, పండ్లు,మిఠాయిలు అందజేశారు. అలాగే వైసీపీ నేతలు ఎర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, మోర్లమురళి, పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడిని చెంబేటి ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. నగర కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో నరసింహారావు, తహసీల్దారు సుధీర్, ఎంఈవోలు, ఎస్‌ఐ, సీఐలకు కూడా శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ, సీపీఎం, జనసేన, కాంగ్రెస్ నాయకులను కలిసి పలువురు శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డిలను పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు నెల్లూరులోని వారి స్వగృహంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

విడవలూరు : మండలంలో నూతన సంవత్సర వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా రామతీర్థం, పార్లపల్లి గ్రామాల్లోని రామలింగేశ్వర, రామాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకులు చెముకుల కృష్ణ చైతన్య, తాతా బాలకృష్ణ, చెముకుల శ్రీనివాసులు, మాతూరు శ్రీనివాసులురెడ్డి, ఇమాంబాషా, విజయరాఘవన్, కొడిమేర్ల శేషయ్య, శ్రీహరికోట గోపి, పొన్నాడి చంద్రశేఖర్ తదితరులు మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి దినేష్‌రెడ్డిలను కలసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే విడవలూరు దళిత కాలనీలో మాలమహానభ, అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, అనంతరం స్వీట్లు పంచారు. కార్యక్రమంలో మాలమహానభ నాయకులు పల్లం శేషమ్మ, సాయిదాసు, నాగూరు మరియమ్మ, ఎల్లు సరోజ, జగదీష్, విజయకుమార్, చందు, శశి పాల్గొన్నారు.

ఉత్సాహంగా నూతన సంవత్సర వేడుకలు

వెంకటాచలం : నూతన సంవత్సర వేడుకలను మండల ప్రజలు సోమవారం ఉత్సాహంగా జరుపుకున్నారు. ప్రజలు కసుమూరు, గొలగమూడితోపాటు ఆయా గ్రామాల్లో ఆలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. మండలంలోని పలు చర్చిలలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సోమిరెడ్డి నివాసంలో....

నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు, సోమిరెడ్డి అభిమానులు సోమవారం అల్లీపురంలోని ఆయన నివాసానికి చేరుకుని శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో గుమ్మడి రాజాయాదవ్, కుంకాల దశరథ నాగేంద్రప్రసాద్, రావూరి రాధాకృష్ణమనాయుడు, వల్లూరు రమేష్‌నాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, రావూరి పద్మనాభ నాయుడు, కోదండయ్యనాయుడు, ధనుంజయనాయుడు తదితరులున్నారు.

కుంచి నివాసంలో....

నిడిగుంటపాళెంలోని బీజేపీ మండలాధ్యక్షుడు కుంచి శ్రీనివాసులు యాదవ్ నివాసానికి మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, కుంచి అభిమానులు చేరుకుని పుష్పగుచ్ఛాలు అందించి కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో హసనాపురం శ్రీనివాసులు, పంది రమణయ్య, గోత్తల నరేష్ తదితరులున్నారు. అలాగే అనికేపల్లిలోని టీడీపీ మండలాధ్యక్షుడు గుమ్మడి రాజా యాదవ్ నివాసానికి టీడీపీ నాయకులు, కార్యకర్తలు, గుమ్మడి అభిమానులు భారీగా చేరుకుని పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

సైదాపురం : మండలంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. సైదాపురం, కలిచేడు, చాగణం గ్రామాల్లోని సాయిబాబా మందిరాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మండల అధికారులకు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

తోటపల్లిగూడూరు : మండలంలోని వెంకన్నపాలెం, కోడూరు, విలుకానిపల్లి, చింతోపు, కొత్తపాలెం తదితర గ్రామాల్లో నూతన సంవత్సర వేడుకలు ఘనంగా జరిగాయి. దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. కోడూరు, కాటేపల్లి సముద్ర తీరాల్లో సందడి వాతావరణం నెలకొంది. కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ జంపాని కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



విడవలూరు : అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మాలమహానభ నాయకులు



టీపీ గూడూరు : సోమిరెడ్డిని సత్కరిస్తున్న టీడీపీ నాయకులు

సోమిరెడ్డి స్వగృహంలో నూతన సంవత్సర సంబరాలు

తోటపల్లిగూడూరు : మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అల్లీపురంలోని స్వగృహంలో తోటపల్లిగూడూరు మండల టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్నారు. సోమిరెడ్డిని పూలమాలలు శాలువాతో సత్కరించారు. టీడీపీ నాయకులు బొమ్మి సురేంద్ర, కొణతం రఘుబాబు, చేవూరు శ్రీనివాసులు, ఊటుకూరు అవినాష్, చింత సీతారామయ్య, గోపిరెడ్డి వెంకటేశ్వర్లు, రమణారెడ్డి, పాకం వెంకయ్య, పార్టీ శ్రేణులు, గ్రామాల కార్యకర్తలు, అభిమానులు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ ఎన్నికలలో సర్వేపల్లి నియోకవర్గంలో సోమిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపిస్తామని నాయకులు, కార్యకర్తలు తెలిపారు.

సోమిరెడికి సన్మానం

పొదలకూరు : మాజీ మంత్రి సోమిరెడ్డిని మండల టీడీపీ నాయకులు ఆయన నివాసంలో కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కోడూరు పెంచలభాస్కర్‌రెడ్డి, వెన్నపూస రాజశేఖర్‌రెడ్డి, అక్కెం సుధాకర్‌రెడ్డి, యాతపు వెంకటరెడ్డి, సయ్యద్‌మస్తాన్, చిడదల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో ఉచిత వైద్యశిబిరం

పొదలకూరు, జనవరి 1: పట్టణంలోని నరసారెడ్డి కాలనీ సమీపంలో గల శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమంలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి నెల్లూరుకు చెందిన డాక్టర్ జునైద్, డాక్టర్ నిష్మా పాల్గొని వృద్ధాశ్రమంలోని రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రీస్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రెసిడెంట్ నౌరాజ్, సెక్రటరీ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం పంపిణీ

స్థానిక కూల్ డ్రింక్స్ షాప్ నిర్వాహకుడు మేడా వెంకటసుబ్బయ్య తన జన్మదినాన్ని పురస్కరించుకుని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు సోమవారం ఉదయం అల్పాహారం అందించాడు. ఈ సందర్భంగా వృద్ధులు వెంకటసుబ్బయ్యకు ఆశీస్సులు అందించారు.



వృద్ధాశ్రమంలో రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ జునైద్

వెండి నందిపై కామాక్షితాయి విహారం

● స్వామి, అమ్మవార్లకు వైభవంగా కల్యాణం



నంది వాహనంపై కామాక్షితాయి, మల్లికార్జున స్వామి

బుచ్చిరెడ్డిపాళెం,జనవరి1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం రాత్రి జొన్నవాడ కామాక్షితాయిని పెద్ద వెండి నంది వాహనంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వహించారు. ముందుగా గంగా, కామాక్షితాయి సమేత మల్లికార్జునస్వామికి ప్రత్యేక కల్యాణోత్సవం నిర్వహించారు. ఉదయం ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు జిల్లా నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చి అమ్మ వారిని దర్శించుకున్నారు. నెల్లూరుకి చెందిన శ్రీనివాస హ్యాండ్‌లూం సెంటర్, విజయలక్ష్మి టెక్స్‌టైల్స్ నిర్వాహకులు, కామాక్షి మెడికల్స్ నిర్వాహకులు అచ్యుత శివకుమార్, నారాయణరావు, మోహన్‌రావులు భక్తులకు ఉచితంగా ప్రసాదాలు అందజేశారు. నందిసేవ గ్రామోత్సవానికి హైదరాబాదుకు చెందిన జనంపల్లి దుష్యంత్‌రెడ్డి, మేఘన,సాకేత్‌లు, కల్యాణోత్సవానికి జొన్నవాడకి చెందిన జొన్నవాడ రవికుమార్ కుటుంబ సభ్యులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. కార్యక్రమాలను ఆలయ చైర్మన్ సుబ్రహ్మణ్యంనాయుడు, ఈవో గిరికృష్ణ, పాలక మండలి సభ్యులు పర్యవేక్షించారు. కాగా సోమవారం రాత్రి కోవూరు టీడీపీ ఇన్‌చార్జి పోలంరెడ్డి దినేష్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు చేశారు

పెంచలకోనకు పోటెత్తిన భక్తులు

రాపూరు(డక్కిలి), జనవరి 1: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనకు సోమవారం భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఎసి జనార్ధనరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాట్లు చేశారు. స్వామివారికి అభిషేకం, పల్లకీ సేవ తదితర కార్యక్రమలు నిర్వహించారు. భక్తులు రద్దీ అధికంగా ఉండడంతో స్వామి వారి దర్శనానికి 2 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ప్రభుత్వ కళాశాలలో మొక్కలు నాటిన అధ్యాపకులు

పొదలకూరు, జనవరి 1 : నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని అధ్యాపకులు మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కాలేజీ ప్రాంగణంలో ప్రహరీ గోడ సమీపంలో కళాశాల చుట్టూ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కే లక్ష్మీనారాయణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అదానీ కృష్ణపట్నం పోర్టులో డిజిటల్ లైబ్రరీ ప్రారంభం

ముత్తుకూరు, జనవరి 1: అదానీ కృష్ణపట్నం పోర్టులో సోమవారం అడ్మిన్ బిల్డింగ్‌లో డిజిటల్ లైబ్రరీని అదాని కృష్ణపట్నం పోర్టు సీఈవో జీజే రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అదాని కృష్ణపట్నం పోర్టు ఉద్యోగులందరూ అవసరమైన సమాచార సేకరణతో పాటు విజ్ఞానాన్ని పెంపొందించుకునేందుకు ఈ డిజిటల్ లైబ్రరీ ఉపయోగపడుతుందని తెలిపారు. కృష్ణపట్నం పోర్టు సౌత్ పోర్టు వద్ద బ్రిడ్జిని సీఈవో ప్రారంభించారు. కృష్ణపట్నం పోర్టు వెస్ట్ గేట్ వద్ద వాహనాల రాకపోకలకు సంబంధించి క్యాష్‌లెస్ పేమెంట్, డిజిటల్ పేమెంట్ చేసే విధంగా యూపీఐ మిషన్స్‌ను, ట్రక్కు డ్రైవర్‌లకు రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించేందుకు నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యాలయం వద్ద మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో సీఓఓ సంజయ్ కొత్త, రాజన్‌బాబు, అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, ఫైనాన్స్ హెడ్ గుడివాడ శ్రీకాంత్, మృత్యుంజయ్‌రామ్, ఐటీ హెడ్ జయలాల్, సెక్యూరిటీ డీజీఎం మనోహర్‌బాబు, వివిధ విభాగాల హెచ్ఓడీలు పాల్గొన్నారు.



డిజిటల్ లైబ్రరీని ప్రారంభించిన పోర్టు సీఈవో జీజే రావు

మృతవీరులకు ఘన నివాళి

మనుబోలు, జనవరి 1: దళిత, పీడిత కులాల ప్రజలు మరో స్వాతంత్ర్యం కోసం పోరాడాలని కుల నిర్మూలనా పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కావలి బాలయ్య అన్నారు. మండలంలోని కాగితాలపూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాగితాలపూరు దళిత యువకుల ఆధ్వర్యంలో మృతవీరులకు సోమవారం కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. కార్యక్రమంలో కులనిర్మూలన పోరాటసమితి రాష్ట్ర సహాయ కార్యదర్శి దుడ్డు వెంకట్రావు, గోను సుబ్బయ్య, యువకులు పాల్గొన్నారు.

నెల్లూరులో 'అమృత్ భారత్' రైలు

● పూలతో స్వాగతం పలికిన బీజేపీ నాయకులు.

నెల్లూరు (వెంకటేశ్వరపురం) జనవరి 1 : కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు సోమవారం నెల్లూరు ప్రధాన రైల్వే స్టేషన్‌కు చేరుకొన్నది. పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా టౌన్ నుంచి బెంగుళూరుకు వెళుతున్న ఈ రైలు సోమవారం స్టేషన్‌కు చేరుకోవడంతో రైల్వే అధికారులు, బీజేపీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఉదయంగా 11.43 గంటలకు చేరుకోగా, ఐదు నిమిషాల తర్వాత గూడూరుకు బయలుదేరింది. విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, స్టేషన్ మాస్టర్ కుమార్, బీజేపీ నాయకులు యశ్వంత్‌సింగ్, రాజేశ్వరి, వంశీధర్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.



నెల్లూరు స్టేషన్‌లో ఆగిన 'అమృత్ భారత్' రైలు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి



టౌన్‌హాలు వినాయక ఆలయంలో..

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 1 : ఆదివారం అర్ధరాత్రి 2023లో తీపి, చేదు గుర్తులు మరచిపోయి 2024లో మంచి జరగాలని ఆశిస్తూ జనం ఆంగ్ల సంవత్సరాదికి స్వాగతం పలికారు. అర్ధరాత్రి యువత హంగామా చేయగా ప్రజలు ఆలయాలు, సాయి మందిరాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. ఉద్యోగులు, చోటామోటా నాయకులు అధికారులు, రాజకీయ నాయకుల ఇళ్లవద్ద సందడి చేశారు. గాంధీనగర్ షిరిడీ సాయిబాబా మందిరంలో భక్తులు తమ కోర్కెలు సఫలం కావాలని క్యాండిల్స్ వెలిగించి చీటీలు రాసి బాబాను ప్రార్థించారు. బాలాజీనగర్ సాయిదర్బార్ అద్దాల మందిరంలో విశేష పూజలు, ప్రత్యేక పూలంగిసేవ జరిగింది. చిల్డ్రన్స్‌పార్కు సాయిసదన్‌లో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. జిల్లా కలెక్టర్ ఎం.హరినారాయణన్, జిల్లా ఎస్పీ డాక్టర్ పీ.తిరుమలేశ్వరరెడ్డి, వివిధ శాఖల ఉన్నతాధికారులు, నగర పాలక సంస్థ కమిషనర్ వికాస్‌మర్మత్, తదితర అధికార్లను కిందిస్థాయి అధికారులు డైరీలు, పండ్లు, పూలమాలలు, బొకేలతో కలిసి నూతన ఆంగ్ల సంవత్సరం శుభాకాంక్షలు తెలిపారు.

ఆంగ్ల సంవత్సరాది సంబరాలు

● ఆలయాల్లో భక్తుల కిటకిట ● అధికారుల ఇళ్ల వద్ద సందడి



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న టీడీపీ నాయకులు

● శ్రీరాజరాజేశ్వరి ఆలయంలో పూలంగిసేవ జరిగింది. సుందరేశ్వరస్వామి, రాజరాజేశ్వరి అమ్మవార్లకు నిత్యపూజలు అభిషేకాలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చారు.

● తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో స్వామివారికి విశేష అలంకారం, తిరుప్పావై పూజలు, రాత్రి అధ్యయన ఉత్సవాలు జరిగాయి. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

● మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయంలో రాత్రి రాపత్తు ఉత్సవం జరిగింది. ప్రత్యేక పూజలు, నిర్వహించారు. భక్తులు భారీగా తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు.

● మూలస్థానేశ్వరాలయంలో స్వామివారికి పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

● అయ్యప్పగుడి, గురువాయురప్పన్ మహావిష్ణువు ఆలయంలో నెయ్యాభిషేకం, ఉచిత ప్రసాదాలు పంపిణీతో పాటు ధనుర్మాసం పూజలు, రాత్రి రాపత్తు ఉత్సవం, శ్రీవేలి ఉత్సవం, గోపురోత్సవాలు జరిగాయి. భారీ సంఖ్యలో భక్తులు ఇరుముడులు కట్టుకుని శబరిమలకు వెళ్లారు.

● నగరంలోని బారాషహీద్ దర్గాలో రూరల్ నియోజకవర్గం టీడీపీ నాయకులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. 2024 ఎన్నికల్లో రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం రావాలని, రూరల్ నియోజకవర్గంలో శ్రీధర్‌రెడ్డి హ్యాట్రిక్ సాధించాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మైనారిటీ నాయకులు షంషుద్దీన్, చిన్న మస్తాన్, ఖాదర్ బాషా, రియాజ్, జాఫర్, తదితర నాయకులు పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థులకు అత్యాధునిక వైద్యం

నెల్లూరు(వైద్యం), జనవరి 1 : నగరంలోని జయభారత్ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ వ్యాధిగ్రస్థులకు అత్యాధునిక వైద్యం అందిస్తున్నట్లు ప్రముఖ వాస్కులర్ సర్జన్ డాక్టర్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆసుపత్రిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కిడ్నీ డయాలసిస్ రోగులకు పిస్టుల ఆపరేషన్ చేసినా విఫలమతియ్యే రోగులకు ప్రత్యేక పద్ధతిలో నరాలను పైకితీసి డయాలసిస్ నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. చెన్నై, హైదరాబాద్ వంటి మెట్రోపాలిటిన్ నగరాల్లోనే అందేబాటులో ఉండే ఈ వైద్యం ప్రస్తుతం జయభారత్ ఆసుపత్రిలో అందుబాటులో ఉందన్నారు. ప్రతి శని, ఆదివారాలు చెన్నై నుంచి జయభారత్‌కి వచ్చి ఇక్కడ బాధితులకు వైద్య అందిస్తున్నానని పేర్కొన్నారు. రూ.80 వేల వరకు ఖర్చయ్యే ఈ చికిత్సను కేవలం రూ.30 వేలకే చేస్తున్నామన్నారు. అలాగే కాళ్ల పుండ్లు, రక్తనాళాల మడతలు, పూడికలు ఉన్న వారికి శస్త్రచికిత్స ద్వారా వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ఈ సమావేశంలో జయభారత్ ఆసుపత్రి జనరల్ మేనేజర్ గురుప్రసాద్, టెక్నీషియన్‌లు వాణి, డిప్యూటీ మేనేజర్ వెంకటేష్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అధికారులకు ఏపీటీఎఫ్ నేతల శుభాకాంక్షలు



జడ్పీ సీఈవోను కలసిన ఏపీటీఎఫ్ నేతలు

నెల్లూరు(విద్య), జనవరి 1 : ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం విద్యాశాఖ జేడీ మువ్వా రామలింగం, జడ్పీ సీఈవో చిరంజీవిలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు మాట్లాడుతూ విద్యా వ్యవస్థలో మంచి ఫలితాలు సాధించాలని, ఉపాధ్యాయ సంఘాలు ఎప్పటిలాగానే అందరితో సత్సంబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి పిచ్చిబాబు, రాష్ట్ర నేతలు రియాజ్, జుల్ఫికర్ అలీ, కృష్ణారెడ్డి, ప్రకాష్‌రెడ్డి, జనార్ధన్, జిల్లా నేతలు మురళీకృష్ణ, కోటేశ్వరరావు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డీఆర్‌డీఏ పీడీకి ఏపీవీఎస్‌వోఏ నాయకులు...



డీఆర్‌డీఏ పీడీని సన్మానిస్తున్న నాయకులు

నెల్లూరు(హరనాథపురం) : ఆంధ్రప్రదేశ్ విలేజ్ సెక్రటేరియట్ ఆఫీసర్స్ అసోసియేషన్(ఏపీవీఎస్‌వోఏ) నాయకులు సోమవారం డీఆర్‌డీఏ పీడీ కేవీ సాంబశివారెడ్డిని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందచేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అ అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్‌కృష్ణ, ప్రధాన కార్యదర్శి జనార్ధన్, కోశాధికారి లోకేష్ హిమంత్ తదితరులు పాల్గొన్నారు.

డీసీసీ అధ్యక్షుడు చేవూరు నివాసంలో...



చేవూరుకు శుభాకాంక్షలు చెబుతున్న నేతలు

నెల్లూరు(వైద్యం) : డీసీసీ అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి నివాసంలో సోమవారంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. జిల్లా పార్టీ నేతలు ప్రత్యేకంగా చేవూరును పూలమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే పీసీసీ సభ్యుడు, జిల్లా ఉపాధ్యక్షుడు తలారి బాలసుధాకర్ వెంకటగిరి నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందచేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సిటీ ఇన్‌చార్జ్ షేక్ ఫయాజ్, యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పర్తి గణేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రాజరాజేశ్వరి పంచలోహ విగ్రహం చర ప్రతిష్ఠ ఉత్సవాలు

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 1 : భక్తుల సమక్షంలో రెండు నెలల క్రితం పోతపోసిన రాజరాజేశ్వరి ఉత్సవ మూర్తి విగ్రహానికి మంగళ, బుధవారాల్లో చర ప్రతిష్ఠ మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ ఏసీ ఏవీ శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గోపూజతో ప్రారంభమై బుధవారం ప్రాణప్రతిష్ఠ పూజలు జరుగుతాయని తెలిపారు.

ఏపీఆర్ఎస్ఏ డైరీ ఆవిష్కరణ



డైరీ ఆవిష్కరిస్తున్న జేసీ కూర్మనాథ్

నెల్లూరు(హరనాథపురం), జనవరి 1 : ఏపీఆర్ఎస్ఏ జిల్లా శాఖ ముద్రించిన 2024 సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను సోమవారం జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఏపీఆర్ఎస్ఏ జిల్లా అధ్యక్షుడు అల్లంపాటి పెంచలరెడ్డి, కార్యదర్శి డానియల్ పీటర్‌రావు, నాయకులు మురళి, సతీష్, నాగరాజు, ప్రదీప్, అనిల్, గోపీకృష్ణ, రమాదేవి, లక్ష్మి, బాలకోటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

డీవైఎఫ్ఐ క్యాలెండర్...

నెల్లూరు(వైద్యం) : నగరంలోని బాలాజీనగర్ సీపీఎం జిల్లా కార్యాలయంలో డీవైఎఫ్ఐ 2024 క్యాలెండర్‌ను సినీ కొరియోగ్రాఫర్ జానీ మా స్టర్ సోమవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, రమణ, రూరల్ అధ్యక్ష, కార్యదర్శులు వంకదారి శ్రీనివాసులు, కోటేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ నేత నరేంద్ర, ఐద్వా నేత మస్తాన్‌బీ పాల్గొన్నారు.

బీటీఏ డైరీ..



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేడీ రామలింగం

నెల్లూరు(విద్య) : బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) నూతన క్యాలెండర్‌ను విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ మువ్వా రామలింగం ఆవిష్కరించారు. నగరంలో జరిగిన ఈ కార్యక్రమంలో జేడీ మాట్లాడుతూ బీటీఏ నేతలు ఉపాధ్యాయుల సర్వీస్‌తో పాటు, ప్రభుత్వ బడుల పరిరక్షణకు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయుల ఉన్నతికి, వారి సమస్యల పరిష్కారానికి తమవంతు పూర్తి సహాయ, సహకారాలను అందచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిట్టేటి రమేష్, అసోసియేట్ అధ్యక్షుడు పల్లం వేణుగోపాల్, కోశాధికారి పీ.ఆదినారాయణ, వర్కింగ్ ప్రెసిడెంట్ డీ.మాల్యాద్రి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మునిసుబ్బు, మాసా ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మయ్య, తిరుపతయ్య, రఘు, జిల్లా నేతలు ఖాజా రహంతుల్లా, కోలా కిరణ్, రాజశేఖర్, రవి, హరి తదితరులు పాల్గొన్నారు.

టీవీఎస్ మోటారు బైక్ విజేత మంజు



విజేతకు కారును అందజేస్తున్న సోమిరెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), జనవరి 1 : చందన, సీఎంఆర్ షాపింగ్‌మాల్‌లో క్రిస్మస్, నూతన, సంక్రాంతి పండుగ సంబరాల్లో 3వ వారం టీవీఎస్ మోటారు బైక్ డ్రా సోమవారం రాత్రి జరిగింది. టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని లక్కీ డ్రా తీశారు. వింజమూరుకు చెందిన మంజు(కూపన్‌నెంబరు 52463) టీవీఎస్ మోటారు బైక్ దక్కింది. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ 3 దశాబ్దాలుగా సీఎంఆర్ చందన బ్రదర్స్ వారు పండుగ సీజన్‌లో తక్కువ ధరకే వస్త్రాలు, బంగారు ఆభరణాలు ఇవ్వడమే కాక లక్కీ కూపన్‌ల ద్వారా కారు, టీవీఎస్ స్కూటర్లు, గృహోపకరణాలు అందజేయుడం అభినందనీయమన్నారు. సీఎంఆర్ అధినేత మావూరు శ్రీనివాసరావు సంబరాల వివరాలు తెలియజేశారు. అనంతరం గతవారం కారు విజేతకు సోమిరెడ్డి కారును అందజేశారు. ఈ కార్యక్రమంలో రాజీయాడ్స్ పెంచలయ్య, బొమ్మి సురేంద్ర, శైలేష్, మేనేజర్ వాసు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నేత కేశవులు జన్మదిన వేడుకలు



కేశవులను సత్కరిస్తున్న గ్రామస్థులు

నెల్లూరురూరల్, జనవరి 1 : మండలంలోని కాకుపల్లి పంచాయతీ వైసీపీ నేత కోసూరు కేశవులు జన్మదిన వేడుకలు సోమవారం ఆయన నివాసం వద్ద ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు, అధికారులు, స్నేహితులు, సన్నిహితులు ఆయనను ఘనంగా సత్కరించారు. కేఎన్ఆర్ అధినేత కుడుముల నాగేశ్వరరావుగౌడ్ రూ.లక్షతో తయారు చేయించిన గజమాలతో కేశవులు, ఆయన సతీమణి, గ్రామ సర్పంచు సుభాషిణిని ఘనంగా సన్మానించారు. తన జన్మదిన వేడుకలకు వచ్చి శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ ఫౌండేషన్ అధినేత ఆల్తూరి మస్తానయ్య, చిరంజీవి యూత్ నాయకులు వేణు(బాబ్జీ), తదితరులు పాల్గొన్నారు.

రేపు విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

నెల్లూరు(హరనాథపురం) : నెల్లూరు టౌన్‌హాల్లో ఈనెల 3వ తేదీ మధ్యాహ్నం 3.30 గంటలకు విశ్రాంత ఉద్యోగులు, సీనియర్ సిటిజన్‌లు, అసోషియేషన్‌తో సంబంధం లేని 75 ఏళ్ల పైబడిన విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తామని ఏపీ స్టేట్ గవర్నమెంటు రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఐ.లక్ష్మీనారాయణ, కార్యదర్శి పీ.వెంకయ్య ఒక ప్రకటనలో తెలిపారు. నెల్లూరులోని ప్రముఖ కంటి వైద్యుడు ఓ.గోపాలకృష్ణను సన్మానిస్తామన్నారు.

రాజకీయ ప్రముఖులకు కల్యాణ్‌రెడ్డి శుభాకాంక్షలు



ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి సతీమణికి శుభాకాంక్షలు తెలుపుతున్న కల్యాణ్‌రెడ్డి

నెల్లూరురూరల్ : పలువురు రాజకీయ ప్రముఖులకు టీడీపీ నెల్లూరురూరల్ యూత్ లీడర్ వేలూరు కల్యాణ్‌రెడ్డి సోమవారం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి నివాసంలో ఆయన సతీమణి సుజితమ్మకు మొక్కకుండీ అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అల్లీపురంలోని ఆయన నివాసంలో శుభాకాంక్షలు తెలిపారు. నూతన సంవత్సరంలో టీడీపీ అధికారంలోకి రానున్నదని ఆశాభావం వ్యక్తం చేశారు.

నూతన ఆలోచనలతో నగరాభివృద్ధి : కమిషనర్



రెవెన్యూ అధికారులతో కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), జనవరి 1 : నగరాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు 2024లో నూతన ఆలోచనలతో అడుగులు వేద్దామని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్‌మర్మత్ పిలుపునిచ్చారు. నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా ఆయన తన నివాసం వద్ద పలువురికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనను మార్యదపూర్వకంగా కలిసిన కార్పొరేషన్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది అనుభవాలను నెమరువేసుకుంటూ అందుకు భిన్నంగా ఆలోచనలు చేసి మరిన్ని సేవలు ప్రజలకు అందేవిధంగా ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. సచివాలయాల నుంచి సమర్థవంతమైన పాలన ప్రజలకు అందాలన్నారు.


పీఎస్ఎల్వీ-సీ 58 తొలి దశ


రెండో దశ


మూడో దశ


నాలుగో దశలో రాకెట్ నుంచి విడిపోతున్న ఉపగ్రహం

గఘన విజయం

కొత్త ఏడాది తొలి ప్రయోగ విజయంతో షార్‌లో సంబరోత్సాహాలు



సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్ఎల్వీ 60వ ప్రయోగం శ్రీహరికోట రాకెట్ కేంద్రంలో కొత్త ఉత్సాహం నింపింది. సంవత్సరం ప్రారంభపు రోజున ఇస్రోకి లభించిన విజయంగా భావిస్తున్నారు. ఇస్రో విజయాశ్వంగా భావించే పీఎస్ఎల్వీ-సీ 58 రాకెట్ సోమవారం ఉదయం ఎక్స్‌పోశాట్ ఉపగ్రహంతో పాటూ కీలక పరిశోధనలకు ఉపయోగపడే పది పరికరాలను అంతరిక్షంలోకి చేర్చింది. ఇస్రో భవిష్యత్ ప్రయాణానికి ఈ ప్రయోగాలు చాలా ప్రాధాన్యం కలిగినవి.

సంబరాలు

ఆదివారం ఉదయం 8.10 గంటలకు మొదలైన రాకెట్ కౌంట్‌డౌన్ 25 గంటల పాటు కొనసాగింది. సోమవారం ఉదయం 9.10 గంటలకు నిప్పులు చిమ్ముకుంటూ గగనతలంలోకి పీఎస్ఎల్‌వీ దూసుకెళ్లింది. ఏ రకమైన తడబాటు లేకుండా నిర్దేశిత కక్ష్యలోకి ఉపగ్రహాన్ని, పరికరాలనూ ప్రవేశపెట్టడంతో షార్‌లో సందడి వాతావరణం నెలకొంది. శాస్త్రవేత్తలు, ఇస్రో ఉద్యోగులు పరస్పరం అభినందించుకుంటూ కనిపించారు. హ్యాపీ న్యూ ఇయర్‌తో పాటూ కంగ్రాట్స్ అనే మాట అందరినోటా వినిపించింది.విజిటర్స్ గ్యాలరీలో ప్రయోగాన్ని చూసేందుకు వచ్చినవారి చప్పట్లతో, ఈలలతో ఆ ప్రాంతం మార్మోగింది. అంతరిక్షంలోకి పంపిన పది పరిశోధక పరికరాల రూపకల్పనలో పాలుపంచుకున్న ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా శ్రీహరికోట నుంచి ప్రయోగాన్ని వీక్షించారు.


షార్‌లో ముంబాయికి చెందిన ఇంజనీరింగ్ విద్యార్థులు


గ్యాలరీలో వీక్షకుల సందడి


నాయుడుపేటలో మౌన దీక్ష


తిరుపతిలో సాష్టాంగ నమస్కారాలతో నిరసన


పాత దుస్తులతో అంగన్వాడీల మౌన దీక్ష

తిరుపతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరాది సందర్భంగా సోమవారం ప్రపంచమంతా వేడుకలు, సంబరాల్లో మునిగి తేలుతుండగా నాయుడుపేటలో అంగన్‌వాడీ సిబ్బంది మాత్రం పాత దుస్తులు ధరించి మౌన దీక్షతో తమ నిరవధిక సమ్మె కొనసాగించారు. గూడూరులో కోలాటం, కోట మండల కేంద్రంలో కబడ్డీ తదితర ఆటలాడి వినూత్న రీతిలో నిరసన వ్యక్తం చేయగా తిరుపతిలో సాష్టాంగ ప్రమాణాలతో ప్రభుత్వం మనసు మారాలని సిబ్బంది ప్రార్థనలు చేశారు. శ్రీకాళహస్తిలో శిబిరంలోనే కేక్ కట్ చేసి న్యూ ఇయర్ వేడుకలు జరుపుకున్న సిబ్బంది అనంతరం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కొత్త ఏడాదిలోనైనా జగన్ బుద్ధి మారి తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. వెంకటగిరి, సూళ్ళూరుపేట, చంద్రగిరి, రేణిగుంటల్లో ఉద్యోగులు ధర్నాలు కొనసాగించారు. సత్యవేడులో ధర్నా చేపట్టిన అంగన్‌వాడీ సిబ్బందిని మాజీ ఎమ్మెల్యే హేమలత, టీడీపీ ఇంఛార్జి డాక్టర్ హెలెన్ పరామర్శించగా మరో నేత జేడీ రాజశేఖర్ సిబ్బందికి ఆర్థికసాయం అందించారు. పుత్తూరులో సమ్మె చేస్తున్న సిబ్బందికి టీడీపీ నేత విజయబాబు రూ. 20 వేలు ఆర్థిక సాయం చేశారు.

అట్టహాసంగా జల్లికట్టు

జనసంద్రమైన కొత్త శానంబట్ల





చంద్రగిరి, జనవరి 1: చంద్రగిరి మండలంలో సంక్రాంతి సందడి మొదలైంది.కొత్తశానంబట్ల గ్రామంలో సోమవారం పశువుల పండుగ(జల్లికట్టు)ను వేడుకగా నిర్వహించారు. కొత్తశానంబట్లతో పాటు పరిసర గ్రామాల నుంచి పశువులను సోమవారం ఉదయం గ్రామానికి తోలుకొచ్చారు. వాటి కొమ్ములు చెలిగి, రంగులు వేసి, కొప్పులను తొడిగి, రాజకీయ నాయకులు, సినీనటులు, దేవుళ్ల ఫొటోలు, రంగు కాగితాలు అంటించిన చెక్క పలకలతో పాటు, నగదు, బట్టలు, విలువైన వస్తు సామాగ్రిని కట్టారు. మధ్యాహ్నం 12గంటల సమయంలో గ్రామంలోని నడివీధిలో పశువులను గుంపులు గుంపులుగా వదిలారు. అప్పటికే గ్రామానికి పరిసర గ్రామాలకు చెందిన జనం పెద్దసంఖ్యలో తరలివచ్చారు.ఉత్సాహవంతులైన యువకులు అల్లె అవతల నిలబడి పరుగులు తీస్తున్న కోడెగిత్తలను నిలువరించేందుకు పోటీ పడ్డారు. కోడెగిత్తల కొమ్ములకున్న చెక్కపలకలను సొంతం చేసుకొనేందుకు పోటీ పడ్డారు. ఈ సందర్భంగా యువకుల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. పశువులను నిలువరించే క్రమంలో కింద పడడంతో పదిమందికి గాయాలయ్యాయి.వీరిని చికిత్స నిమిత్తం తిరుపతి రుయాస్పత్రికి తరలించారు. జల్లికట్టును తిలకించడానికి వచ్చిన వారందరికీ గ్రామస్తులు భోజన, తాగునీటి సౌకర్యం కల్పించారు.

తిరుపతి గంగమ్మ గుడిలో నిధుల గోల్‌మాల్

పాపమంతా పోయినోడిదే!

లెక్కల్లేని సొమ్ము రూ.52లక్షలుగా తేలింది

చనిపోయిన ఈవో బెనిఫిట్స్ నుంచి రికవరీ

వారంలో దేవదాయశాఖ కమిషనర్‌కు నివేదిక

సిబ్బందిపై ఆరోపణలపైనా విచారణ : ఆర్జేసీ

తిరుపతి, జనవరి 1 (ఆంధ్రజ్యోతి):తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ గుడిలో జరిగిన గోల్‌మాల్‌పై శిక్ష మొత్తం చనిపోయిన ఇన్‌చార్జి ఈవో మునికృష్ణయ్య కుటుంబంపై పడనుంది.దేవదాయ శాఖ పరిధిలోని ఈ ఆలయంలో జరిగిన నిధుల దుర్వినియోగంపై ఐదుగురు అధికారులతో చేపట్టిన విచారణ నివేదిక ఆ శాఖ ప్రాంతీయ సంయుక్త అధికారి (ఆర్జేసీ)సత్యనారాయణ మూర్తి చేతికి వచ్చింది. తుది పరిశీలన అనంతరం బాధ్యులపై చర్యలు నిమిత్తం మరో వారం రోజుల్లో ఆ శాఖ కమిషనర్‌కు నివేదిక పంపనున్నట్టు ఆయన 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధికి చెప్పారు. విచారణ నివేదికలో రూ.52లక్షలకు లెక్కల్లేవని గుర్తించామని...వాటిని చనిపోయిన ఈవో మునికృష్ణయ్య బెనిఫిట్స్ నుంచి రికవరీ చేయనున్నట్టు తెలిపారు. ఆలయంలో అవినీతి అక్రమాలు జరిగినట్టు వచ్చిన ఆరోపణలపై 'గంగమ్మ గుడిలో గోల్‌మాల్' శీర్షికన డిసెంబరు 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం అటు దేవదాయ శాఖతో పాటు ఇటు నగరంలోనూ తీవ్ర చర్చనీయాంశమైన విషయం తెలిసిందే.ఈ క్రమంలో ఆరోపణలపై నిగ్గుతేల్చాలని విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో దేవదాయ శాఖ ఐదుగురు సభ్యులతో విచారణ కమిటీని నియమించింది.అయితే తప్పులన్నింటికీ చనిపోయిన ఈవోనే బాధ్యుడిని చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. మునికృష్ణయ్య చనిపోయిన తర్వాత కూడా ముందస్తుగా సంతకం పెట్టివున్న చెక్కులను ఆలయ సిబ్బంది విత్‌డ్రా చేసుకున్నట్టు తెలుస్తోంది. అదేవిధంగా నకిలీ రసీదులతో కొంతమంది సిబ్బంది భక్తుల నుంచి డబ్బులు వసూలు చేసినట్టు బలమైన ఆరోపణలున్నాయి.ఈ లెక్కలను తారుమారు చేసేందుకు దొంగ రసీదులు సృష్టించినప్పటికీ రూ.52లక్షలు మాయమైనట్టు గుర్తించారు. జనరల్ అకౌంట్‌కు సంబంధించి రూ.31లక్షలు, ఆలయ ప్రాకారానికి సంబంధించి రూ.21లక్షలు గల్లంతైనట్టు నివేదిక ద్వారా తెలియవచ్చింది. అయితే సిబ్బంది చేతివాటంపై అధికార పార్టీ పెద్దల ఒత్తిడి కారణంగానే ఉన్నతాధికారులు మౌనం దాల్చుతున్నారన్న ప్రచారం జరుగుతోంది.నిందలన్నీ చనిపోయిన వ్యక్తిపై వేసి వారి కుటుంబాన్ని బలిపశువు చేయడం ఎంతవరకు సమంజసమన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అదేవిధంగా మునికృష్ణయ్య గతంలో పనిచేసిన కుందాల గోవిందరాజ స్వామి ట్రస్టు, దేశమ్మ ఆలయాలపై కూడా ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో వాటిపై కూడా విచారణ జరిపించాలని ఆర్జేసీ మౌఖిక ఆదేశాలిచ్చారు. గంగమ్మ ఆలయ పునః నిర్మాణంలో భాగంగా తొలగించిన స్క్రాప్‌ను విక్రయించినట్టు తన దృష్టికి రాలేదని, దానిపై కూడా విచారణ జరుపుతామని చెప్పారు. ఆలయ సిబ్బందిపై వస్తున్న ఆరోపణలపై కూడా విచారణ జరిపించి అవసరమైన చర్యలు తీసుకుంటామని ఆర్జేసీ సత్యనారాయణ మూర్తి చెప్పారు.



మేత భూముల్లో తవ్వకాలకు బ్రేక్

హైకోర్టు ఉత్తర్వులతో సత్యవేడులో నిలిచిన మైనింగ్

సత్యవేడు, జనవరి 1: సత్యవేడు మండలంలోని మేతబీడు భూముల్లో జరుగుతున్న గ్రావెల్ తవ్వకాలకు బ్రేక్ పడింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆ పార్టీ నాయకులకు గ్రావెల్ తవ్వకాలు ప్రధాన ఆదాయ వనరుగా మారాయి. దీంతో నియోజకవర్గ కేంద్రమైన సత్యవేడు సహా ఏడు మండలాల్లో గ్రావెల్ తవ్వకాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయి.అడ్డగోలుగా అనుమతులు పొంది నిత్యం వందలాది వాహనాల్లో యథేచ్ఛగా సరిహద్దు దాటించి కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. ఈ క్రమంలో అసైన్డ్, డీకేటీ భూములని కాకుండా గ్రామాల్లో పశువులు, మూగ జీవాల పోషణ కోసం వదిలి పెట్టిన మేతబీడు భూముల్లో సైతం తవ్వకాలు జరుపుతూ సహజ వనరుల దోపిడీకి తెరలేపారు. కొన్ని చోట్ల స్థానికుల నుంచి వ్యతిరేకత ఎదురైనా కేసుల పేరుతో భయపెట్టి మైనింగ్ జరుపుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఇదిలా ఉండగా సత్యవేడు మండలం కాదిరివేడు పంచాయతీ పరిధిలోని 93, 1/2బీ, 17/1, 17/19, 127/3, 128/1ఏ, 129, 130, 131, 132, 133, 134/1, 135/1, 136, 138, 140/2, 142/1, 249/2 సర్వే నెంబర్లలోని సుమారు వంద ఎకరాలకు పైగా మేతబీడు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు 2021లో మైనింగ్ అధికారులు ఎన్ఓసీలు ఇచ్చారు. రెవెన్యూ రికార్డుల్లో మేతబీడుగా పేర్కొన్న ఆ భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు అనుమతులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు పి.శివకుమార్ 2022లో హైకోర్టులో ప్రజా ప్రయోజనవ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం గ్రావెల్ అక్రమ తవ్వకాలను తక్షణం నిలిపివేయాలని మైనింగ్‌శాఖ అసిస్టెంట్ డైరెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ప్రస్తుతం మేతబీడు భూముల్లో గ్రావెల్ తవ్వకాలకు తాత్కాలికంగా చెక్ పడింది.

టీడీపీ విజయానికి కృషి చేయండి



సునీల్‌కుమార్‌కు పూలతో అలంకరించిన సైకిల్ అందజేస్తున్న నేతలు

గూడూరు, జనవరి 1: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో అందరూ కలిసికట్టుగా పనిచేసి టీడీపీ విజయానికి కృషిచేయాలని మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. సోమారం స్థానిక పార్టీ కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. టీడీపీ నాయకులు పూలతో అలంకరించిన సైకిల్‌ను సునీల్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో టీడీపీకి ప్రజాదరణ రెట్టింపైందన్నారు. వైసీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని చెప్పారు. చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని, అందరం ఐక్యమత్యంతో టీడీపీని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో పులిమి శ్రీనివాసులు, ఆరికట్ల మస్తాన్ నాయుడు, బిల్లు చెంచురామయ్య, వాటంబేడు శివకుమార్, మట్టం శ్రావణి, గుండాల లీలావతి, నటశేఖర్, వేముల సునీల్, అమరయ్య, పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ సదస్సుకు తరలిరండి

పెళ్లకూరు, జనవరి 1: రాష్ట్ర సర్పంచుల సంఘం, పంచాయతీరాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీన మంగళగిరిలో జరగనున్న పంచాయతీరాజ్ సదస్సుకు పార్టీలకు అతీతంగా సర్పంచులు తరలిరావాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్, పంచాయతీరాజ్ రాష్ట్ర కార్యదర్శి దేవారెడ్డి నాగేంద్రప్రసాద్‌రెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం వారు మీడియాతో మాట్లాడుతూ పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు వానపల్లి లక్ష్మీముత్యాలరావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు హాజరవుతారని తెలిపారు.

బాబుతోనే భవిష్యత్తుకు భరోసా



కొండుగుంటలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

కోట, జనవరి 1: మాజీ సీఎం చంద్రబాబునాయుడుతో పేదల భవిష్యత్తుకు భరోసా ఉంటుందని టీడీపీ నాయకులు అన్నారు. మండల పరిధిలోని కేశవరం పంచాయతీ కొండుగుంటలో సోమవారం బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం జరిగింది. టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి మేనిఫెస్టో గురించి వివరించారు. కార్యక్రమంలో సర్వోత్తమరెడ్డి, శ్రీనివాసులు, రాధాకృష్ణారెడ్డి, మోహన్‌రెడ్డి, నారాయణ, వెంకటకృష్ణారెడ్డి, బాలకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

కురుగొండ్లకు పలువురి శుభాకాంక్షలు



మాజీ ఎమ్మెల్యే రామకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

వెంకటగిరి, జనవరి 1: పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. బాలాయపల్లి మండలం భైరవరం గ్రామానికి చెందిన దాసరి రాజగోపాల్ నాయుడు, ప్రభాకర నాయుడు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. కేక్ కట్ చేశారు. అదేవిధంగా సైదాపురం మండలానికి చెందిన దిలీప్ చౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్‌ను కట్ చేశారు. మాజీ ఎమ్మెల్యేను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జీఎన్ఆర్ సర్వీస్ ట్రస్టు అధినేత గంగోటి నాగేశ్వరావు జన్మదినాన్ని పురష్కరించుకొని ఆయన నివాసంలో మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పులికొల్లు రాజేశ్వరావు, పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, కాపా శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు. అలాగే రాపూరు క్రాస్ రోడ్డు వద్ద ఉన్న డాక్టర్ మస్తాన్ చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో నూతన సంవత్సర వేడుకలు జరిగాయి. డాక్టర్ మస్తాన్ యాదవ్ కేక్‌ను కట్ చేసి నాయకులకు పంచిపెట్టారు

నెలవలకు సన్మానం



నెలవల దంపతులను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

నాయుడుపేట టౌన్, జనవరి 1: సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం, అమృతసరళ దంపతులను ఆపార్టీ నాయకులు సన్మానించారు. సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా పట్టణంలోని ఆయన నివాసంలో కేక్ కట్ చేశారు. నెలవల దంపతులకు శాలువాలు కప్పి, గజమాలతో సన్మానించారు. టీడీపీ నాయకులు గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, విజయకుమార్ నాయుడు, శ్రీనివాసులు నాయుడు, అశోక్‌రెడ్డి, చక్రపాణి, గోపాలకృష్ణ, సుబ్బరాయులు, చెంచయ్య, కన్నెమ్మ, సుజాత, సుగుణమ్మ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాల సాధనకు కష్టపడి చదవాలి



విద్యార్థికి కేక్ తినిపిస్తున్న డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి

చిల్లకూరు, జనవరి 1: ప్రతి విద్యార్థీ లక్ష్యాలను ఎంచుకుని వాటిని సాధించుకునేందుకు కష్టపడి చదవాలని డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం స్థానిక డానియల్ చిల్డ్రన్స్‌హోమ్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి విద్యార్థులకు పంచిపెట్టారు. డానియల్ చిల్డ్రన్స్‌హోమ్‌లో విద్యార్థులకు భోజనం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను నిజం చేయాలన్నారు. ఉన్నత స్థాయికి చేరుకుని భవిష్యత్తు తరాల వారికి స్ఫూర్తిదాయకంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో సీఐలు దశరథరామారావు, వేణుగోపాల్‌రెడ్డి, ఎస్ఐలు అంజిరెడ్డి, మనోజ్‌కుమార్, సిబ్బంది సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులురెడ్డి, భాస్కర్, సురేష్, ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, పీడీ శ్రీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు

సూళ్లూరుపేట, జనవరి 1: పీఎస్ఎల్వీ-సీ 58 ప్రయోగం విజయవంతం కావడంతో శాస్త్రవేత్తలకు పలువురు అభినందనలు తెలియజేశారు. తిరుపతి ఎంపీ గురుమూర్తి, టీడీపీ నేత, టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రా రెడ్డి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాకాటి నారాయణ రెడ్డి, జిల్లా టీడీపీ కార్యదర్శి వేనాటి సతీష్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. భారతదేశ ఖ్యాతిని ఇనుమడింపజేశారంటూ ఇస్రో శాస్త్రవేత్తలకు అభినందనలు తెలిపారు.

స్వర్ణకాంతుల్లో చెంగాళమ్మ



సూళ్లూరుపేట, జనవరి 1: ఆంగ్ల సంవత్సరాది సందర్భంగా సోమవారం చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణశోభతో వెలుగొందారు. తెల్లవారుజామున ప్రత్యేక అభిషేకాల అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ఆలయాన్ని రంగురంగుల పుష్పాలు, రంగువల్లులు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, టీడీపీ నేత కొండేపాటి గంగాప్రసాద్, తానంకి నానాజీ, మున్సిపల్ చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ దువ్వూరు బాలచంద్రారెడ్డి, ఈవో శ్రీనివాసులురెడ్డి, పాలకమండలి సభ్యులు పాల్గొన్నారు.

హామీలను నెరవేర్చేవరకు సమ్మె ఆగదు





గూడూరులో కోలాటం, కోటలో కబడ్డీ ఆడుతున్న అంగన్వాడీలు

గూడూరు, జనవరి 1: ఎన్నికల సమయంలో సీఎం జగన్ అంగన్వాడీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు సమ్మె ఆగదని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. స్థానిక గ్రామసేవకుల భవనం వద్ద అంగన్వాడీ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె సోమవారంతో 21వ రోజుకు చేరుకుంది. దీక్షా శిబిరం వద్ద అంగన్వాడీలు కోలాటం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుదూ 21రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదన్నారు. కార్యక్రమంలో ఇంద్రావతి, ప్రభావతి, ఆసియా, వజ్రమ్మ, మంగమ్మ, కోటమ్మ, శివకుమార్, బీవీరమణయ్య, సురేష్, ప్రసాద్, గోపినాథ్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలు మౌనంపాటిస్తూ నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ముకుంద మాట్లాడుతూ ఎన్నడూలేని విధంగా ముఖ్యమంత్రి జగన్ అంగన్వాడీలు రోడ్డుమీద చేరేవిధంగా చేశారన్నారు. ఇకనైనా ప్రభుత్వం స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ ప్రాజెక్టు కార్యదర్శి శ్యామలమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద తడ, సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాలకు చెందిన అంగన్వాడీలు చేస్తున్న సమ్మె 21కి చేరింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూనియన్ నాయకురాలు హైమావతి మాట్లాడుతూ అంగన్వాడీల మూడు వారాలుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, తమ సమస్యలను పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. వీరికి సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

కోట: పట్టణంలోని స్త్రీశిశు సంక్షేమ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు ఆటలు ఆడుతూ నిరసన తెలిపారు. దీక్షా శిబిరం ఎదుట కబడ్డీ ఆడి, నృత్యాలు చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

వెంకటగిరి: సమస్యల సాధన కోసం బంగారుపేట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్వాడీలు నిర్వహిస్తున్న రిలే దీక్ష సోమవారం 21వ రోజు కొనసాగింది. అంగన్వాడీలకు ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్వాడీలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎఫ్ యూనియన్ నాయకులు ఉదయ్‌భాస్కర్, ఆర్.కృష్ణయ్య, పెద్దయ్య, సీఐటీయూ నేతలు వడ్డిపల్లి చెంగయ్య, స్వరూపారాణి, మంజుల, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.





నాయుడుపేటలో గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు - వెంకటగిరిలో ఒంటి కాలిపై నిలబడి నిరసన

పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించండి

గూడూరు, జనవరి 1: మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 7వ రోజు కొసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ.26వేలు అందజేయాలన్నారు. అలాగే పర్మినెంట్ ఉద్యోగులకు ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు ఆదాయ పరిమితితో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలను అందజేయాలని విజ్ఞప్తి చేశారు. వారం రోజులుగా సమ్మె చేస్తున్నా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోకుండా మొండి వైఖరితో వ్యవహరించడం మంచిపద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో శివకుమార్, రమేష్, గోపినాథ్, బీవీ రమణయ్య, కోటేశ్వరరావు, పెంచలప్రసాద్, సంపూర్ణమ్మ, రాఘవయ్య, శీనయ్య, కొండయ్య, అరుణమ్మ, పెంచలమ్మ, సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుంచి పారిశుధ్య కార్మికులు నినాదాలు చేస్తూ ర్యాలీగా గాంధీ విగ్రహం వద్దకు చేరుకున్నారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ 7 రోజులుగా పారిశుధ్య కార్మికులు సమ్మె నిర్వహిస్తుంటే ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదన్నారు. కార్మికుల సమ్మెతో పట్టణంలో చెత్త నిల్వచేరి ఆరోగ్యానికి ఇబ్బందికరంగా మారుతుందన్నారు. కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని అన్నారు. కార్యక్రమంలో ముకుంద, మస్తానయ్య, అరావలి, మధు, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: మున్సిపాలిటీ కార్యాలయం వద్ద పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారం కూడా కొనసాగింది. తమ డిమాండ్లను అంగీకరించే వరకు విధులకు హాజరుకాబోమని కార్మికులు తేల్చిచెప్పారు. ఎన్నికల ముందు జగన్ ఇచ్చిన హామీలను నెరవేర్చమని అడుగుతున్నామని, ప్రభుత్వం దిగివచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు చొరవచూపాలని సీఐటీయూ నాయకుడు సాంబశివయ్య అన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు లక్ష్మయ్య, అల్లెయ్య, పద్మనాభయ్య తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల చేపట్టిన ధర్నా సోమవారం 7వ రోజు కొనసాగింది. కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యలను పరిష్కరించేవరకు ఆందోళన విరమించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న నాయకులు

నేతలకు పలువురి శుభాకాంక్షలు

పెళ్లకూరు, జనవరి 1: మండలంలోని చిల్లకూరులో ఎన్డీసీసీబీ చైర్మన్ కామిరెడ్డి సత్యనారాయణరెడ్డి నివాసంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి, జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లా తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు. అదేవింగా కొత్తూరులోని టీడీపీ కార్యాలయంలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంచి కృష్ణయ్యకు రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌నాయుడు, ప్రసాద్‌నాయుడు తదితరులు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్‌కు, సీనియర్ నాయకుడు పేరం రమేష్‌నాయుడుకు నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు.

నాయుడుపేట: ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్యకు వైసీపీ నాయకులు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. గజ పూలమాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే మాజీ మంత్రి డాక్టర్ పరసారత్నంను టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజ పూలమాలతో సన్మానించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి దర్శనం కోసం క్యూలైన్లలో నిరీక్షిస్తున్న భక్తులు

డక్కిలి, డిసెంబరు 1: నూతన సంవత్సరం సందర్భంగా మండలంలోని ఆలయాలు సోమవారం భక్తులతో కిటకిటలాడాయి. దేవునివెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి ఆలయంలో తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొనేందుకు క్యూలైన్లల్లో బారులుతీరారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తజనంతో దేవునివెల్లంపల్లి గ్రామం సందడిగా మారింది. ఆలయానికి భక్తులు పోటెత్తడంతో ఈవో శ్రీధర్ నాయుడు పర్యవేక్షణలో ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. అలాగే వెంబులూరు సమీపంలోని యోగ లక్ష్మీనరసింహస్వామి, డక్కిలిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు భక్తులు కిక్కిరిసిపోయాయి.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు

గూడూరు, జనవరి 1: పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వరప్రసాద్‌రావు అన్నారు. సోమవారం స్థానిక ఐసీఎస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో పట్టణంలో అపరిశుభ్ర వాతావరణం నెలకొందన్నారు. పర్మినెంట్ పారిశుధ్య కార్మికులతో చెత్తాచెదారాలను తొలగించడంతోపాటు కాలువలను శుభ్రం చేయించి పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, నాయకులు పాల్గొన్నారు.

గిరిజనులకు దుప్పట్ల అందజేత

కోట, జనవరి 1: కోట పట్టణ పరిధిలోని నార్త్‌గిరిజన కాలనీలోని గిరిజనులకు డాక్టర్ సారంగం విజయశంకర్ వర్ధంతిని పురస్కరించుకొని సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. డాక్టర్ విజయశంకర్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధి డాక్టర్ సారంగం రమేష్‌బాబు, బీజేపీ నాయకులు అంబరీషా, వెంకటేశ్వర్లు, నాగరాజరావు, పరుశురామ్‌సాయి పాల్గొన్నారు.

అమృత్‌భారత్ రైలుకు స్వాగతం

గూడూరు, జనవరి 1: స్థానిక రైల్వేస్టేషన్‌కు సోమవారం మధ్యాహ్నం అమృత్‌భారత్ రైలుకు అధికారులు, బీజేపీ నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్‌లోని మాల్దా నుంచి బెంగళూరు వరకు ప్రయాణించే అమృత్‌భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించడం జరిగిందన్నారు. గంటకు 130 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించే ఈరైలుకు గూడూరులో స్టాపింగ్ ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, గాలి ప్రకాష్‌నాయుడు, చెంచురెడ్డి, ఛీఫ్ కమర్షియల్ బుకింగ్ అధికారి వెంకటేశ్వరరావు, డాక్టర్ సుందర్‌కుమార్, మయూరి శ్యామ్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



నూతన సంవత్సర వేడుకల సందర్భంగా విశేష అలంకరణలో దర్శనమిస్తున్న మన్నారు పోలూరు చెంగాళమ్మ

చిట్టేడు చెరువులో పశువుల కాపరి గల్లంతు



సుబ్రహ్మణ్యం (ఫైల్‌ఫొటో)

కోట, జనవరి 1: కోట మండలం చిట్టేడు చెరువులో పశువుల కాపరి ఎం. సుబ్రహ్మణ్యం గల్లంతయ్యాడు. అగ్నిమాపక సిబ్బంది, రెస్క్యూ బృందం గాలింపు చర్యలు చేపట్టాయి. స్థానికుల కథనం మేరకు... చిట్టేడు గ్రామానికి చెందిన నన్నెమాల సుబ్రహ్మణ్యం ఆదివారం పశువులను నీళ్ల తాగేందుకు చెరువులోకి తోలాడు. ఎంతకీ పశువులు గట్టుపైకి రాకపోవడంతో సుబ్రహ్మణ్యం చెరువులోకి దిగాడు. సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుటుంబసభ్యులు గాలించడంతో చెరువు దగ్గర బట్టలు, చేతికర్ర, చెప్పులు కనబడ్డాయి. సోమవారం గ్రామస్తులంతా కలసి అధికారులకు ఫిర్యాదు చేయడంతో అగ్నిమాప సిబ్బంది, రెస్క్యూ టీమ్ చెరువులో గాలింపు చేపట్టారు. చీకటిపడినా సుబ్రహ్మణ్యం జాడ దొరకలేదు.

సోమిరెడ్డికి సన్మానం



సోమిరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేస్తున్న వేలూరు కల్యాణ్‌రెడ్డి

పెళ్లకూరు, జనవరి 1: నూతన సంవత్సరం సందర్భంగా మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి మండలంలోని శిరసనంబేడు గ్రామానికి చెందిన కేఆర్ ఛారిటబుల్ ట్రస్టు చైర్మన్ వేలూరు కల్యాణ్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. అలాగే నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డిని కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం నెల్లూరులోని వేదాయపాలెంలో ఉన్న సాయి సేవా సదనం ఆశ్రమంలో వృద్ధులు, అనాథలు, దివ్యాంగులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో కుంపటి సునీల్, రమాశంకర్, సిసింద్రి దినేష్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేకాలంకరణలో ముత్యాలమ్మ, పోలేరమ్మ, కోటమ్మ

గూడూరు, జనవరి 1: పట్టణంలో పలు ఆలయాల్లో సోమవారం నూతన సంవత్సరం సందర్భంగా ప్రత్యేకపూజలు నిర్వహించారు. స్థానిక ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయం, సాయిబాబాగుడి, కోదండరామాంజనేయస్వామి ఆలయం, చెన్నకేశవస్వామి ఆలయం, బాలాజీ నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. భక్తులు వేకువజాము నుంచే స్వామివార్లను దర్శించుకునేందుకు బారులు తీరారు. స్థానిక వరదానగర్‌లోని వాలాయనందస్వామిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం జరిపారు. అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా పట్టణంలోని ఎస్‌పీఎల్‌సీ చర్చి, ప్రార్థనామందిరం, హోసన్నమందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పూజలు చేశారు. వేకువజామునుంచే భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

తడ: నూతన సంవత్సర సందర్భంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. స్థానిక భువనేశ్వరస్వామి ఆలయంలో స్వామివారు చందనా అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వగా, షిరిడీ సాయిబాబా ఆలయంలో స్వామివారికి పుష్పలంకరణ చేశారు. ఇక చర్చిలు, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మకు సోమవారం ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారిని పూలతో అంలంకరించి పూజలు నిర్వహించారు. కలవకొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలోనూ ప్రత్యేకపూజలు జరిగాయి. భక్తులు పూజల్లో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అదేవిధంగా పలు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను ముత్యాలతో అలంకరించారు. అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. గూడలిలోని సంఘమేశ్వరుడు, పర్వతవర్థిని భీమేశ్వరుడి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

అయోధ్య అక్షింతల పంపిణీ

గూడూరు, జనవరి 1: అయోధ్య అక్షింతలను సోమవారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విశ్వహిందూపరిషత్ నాయకుడు మురళీనాయుడు మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్యలోని రామమందిరం శ్రీరామ విగ్రహానికి ప్రాణప్రతిష్ఠ జరగనుందన్నారు. దీంతో అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను ప్రతి ఇంటికీ అందజేస్తున్నామని తెలిపారు. 22వ తేదీ ఈ అక్షింతలను ప్రజలు శ్రీరామునికి పూజలు నిర్వహించి వాటితో ఆశీర్వాదం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రామసుబ్బరాజు, కృష్ణంరాజు, రత్నం తదితరులు పాల్గొన్నారు.



అయోధ్య అక్షింతలను అందజేస్తున్న విశ్వహిందూపరిషత్ నాయకులు